
టాప్ న్యూస్

**కేజ్రీవాల్‌కు ఏటీఎంలా..**
- పంజాబ్ ప్రభుత్వం
- కేంద్రమంత్రి అమిత్ షా




02

**ప్రజల కోసం ఎక్కడికైనా వస్తా...**
- పవన్ కల్యాణ్



02

**జనం కోసం కాదు.. మూసీ చుట్టూ ఉన్న భూముల కోసం..**
- దిక్కుమాలిన ప్రణాళిక
- ప్రజంటేషన్ తో ఫైరయిన కేటీఆర్



02

ANN తెలుగు
Follow: @ANNTELUGU
15-03-2026
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 77 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

## మూసీ చుట్టూ.. సవాళ్ళు

రాజకీయాల్లో ప్రతి నిర్ణయం వెనుక ఒక వ్యూహం ఉంటుంది. ప్రతి సంఘటన వెనుక ఒక సందేశం ఒక సంకేతం అంతర్లీనంగా దాగి ఉంటుంది. మూసీ ప్రక్షాళనపై ప్రభుత్వ పట్టుదల ఎంతవరకు ఫలిస్తుంది? జీహెచ్ఎంసీ ఎన్నికలలో పార్టీలు ఎలాంటి వ్యూహాలతో ముందుకు వస్తున్నాయి? అడవుల్లో తుపాకీతో సాగిన పోరాటం... ఇప్పుడు బ్యాలెట్ బాట పట్టబోతుందా? ప్రపంచ రాజకీయాల్లో ఇరాన్–ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి? రాజకీయ చదరంగంలో ముఖ్యమంత్రుల పట్టుదల ఒకవైపు, ప్రజల ఆకాంక్షలు మరోవైపు ఉత్కంఠను రేపుతున్నాయి. మూసీ నుండి ఇరాన్ వరకు ప్రతి అంశం సామాన్యుడి జీవితంపై ప్రభావం చూపించేదే.

**- తెలంగాణ తాజా రాజకీయాలపై ఏఎన్ఎన్ సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో



# యుద్ధంలో భీభత్సం

### ఇరాన్ పై పదివేల డ్రోన్లతో ఎటాక్

- ఇరాన్ ఆర్థికకిరీటం ఖర్గ్ ఐలాండ్‌పై ట్రంప్ దాడి
- శనివారం రాత్రి ఇజ్రాయెల్ పై మిస్సైళ్లతో ప్రళయం
- ఒకేసారి 1430 మిస్సైళ్ళతో ఇరాన్ భీకర దాడి
- ఇరాన్ సైన్యం 100% ఖతం.. త్వరలోనే హోర్ముజ్ ఓపెన్ చేస్తాం
- ఇతర దేశాలు కూడా యుద్ధనౌకలను పంపాలని ట్రంప్ విజ్ఞప్తి
- దాడులతో దడపుట్టిస్తున్న ఇరాన్.. సౌదీలో ఐదు అమెరికా విమానాలు ధ్వంసం

మహా నెట్ వర్క్ : యుద్ధం భీభత్సంగా మారింది. అమెరికా పదివేల ఏఐ డ్రోన్లతో ఎటాక్ చేస్తే.. ఇరాన్ మిస్సైళ్ళ వర్షం కురిపించి షేకాడిస్తోంది. ఇరాన్ ప్రతిఘటన అటు అమెరికా, ఇజ్రాయెల్ ఇటు గల్ఫ్ దేశాలు షేక్ అవుతున్నాయి. అమెరికాఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై దాడులను రోజురోజుకు ఉద్ధృతం చేస్తున్నాయి. డ్రోన్లు, క్షిపణులను భారీస్థాయిలో వినియోగిస్తున్నాయి. ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికా 10 వేల డ్రోన్లను పశ్చిమాసియాలో మోహరించగా, ఇరాన్ తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. తాజా యుద్ధంలోనూ ఇరాన్ షాహెద్ డ్రోన్లను ప్రయోగిస్తుండగా, వీటిని అడ్డుకునేందుకు అమెరికా భారీ సంఖ్యలో మెరోప్స్ డ్రోన్‌లను మోహరించింది. మెరోప్స్ ఒక్కో డ్రోన్ ఖర్చు దాదాపు 14 వేల నుంచి 15 వేల డాలర్లు ఉంటుందని అంచనా.

మిగతా 2లో



### దుబాయ్.. బైబై
- యుద్ధభయంతో.. వెలవెల
- ఒకప్పుడు విలాసం.. ఇపుడు విలాపం
- ఖాళీగా లగ్జరీ హోటల్స్.. మూతపడ్డ బ్యాంకులు

02

### ఇరాన్‌లో పాలన మార్పు సాధ్యం కాదు
ప్రభుత్వాన్ని కూలదోయలేకపోవడం మా వైఫల్యం కాదు

02

# హైదరాబాద్‌లో డబుల్ డెక్కర్ కారిడార్

పైన మెట్రో, మధ్యలో నేషనల్ హైవే, కింద అండర్‌పాస్‌లు

కేకాపేటగా మారనున్న హయత్ నగర్

రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** గ్రేటర్ ట్రాఫిక్‌ను తగ్గించేందుకు నగరంలో డబుల్ డెక్కర్ కారిడార్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. విజయవాడ వెళ్లే మార్గంలో ఎల్‌బీ నగర్ నుంచి హయత్ నగర్ మధ్య ఈ డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మించనున్నట్లు తెలిపారు. రూ.940 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు వివరించారు. 3 హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్లు కూడా ఇదే ప్రాంతానికి రానున్నాయని స్పష్టం చేశారు. హయత్ నగర్ సాయిబాబా ఆలయం (తొర్రూర్ ఎక్స్ రోడ్) నుంచి జీ స్కూల్ వరకు సుమారు రూ.10 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు 2 లేన్లుగా ఉన్న రహదారిని 4 లేన్లుగా విస్తరించనున్నారు. ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్ రేడియో స్టేషన్ వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టును మొత్తం రూ. 940 కోట్ల వ్యయంతో చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో తన వాటాగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 200 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ డబుల్ డెక్కర్ కారిడార్‌లో పైన మెట్రో రైలు పరుగులు పెట్టనుండగా.. మధ్యలో నేషనల్ హైవే.. కింద స్థానికంగా ప్రయాణించే వాహనాల కోసం వెహికిల్ అండర్ పాస్‌లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

మిగతా 2లో

# పైలట్ రోహిత్ రెడ్డి ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీ..

### ఈగల్ టీమ్ పై కాల్పులు

డ్రగ్స్ పార్టీ చేసుకుంటూ కాల్పులు.. అర్ధరాత్రి ఉద్రిక్తత..

పోలీసుల అదుపులో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, పైలట్ రోహిత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫాంహౌస్ ను అర్ధరాత్రి పోలీసులు చుట్టుముట్టారు రంగారెడ్డి జిల్లా మెయినాబాద్‌లో ఈగల్ టీమ్ చేసిన దాడుల్లో 2 గ్రాముల కొకైన్ లభ్యమైంది. డ్రగ్స్ పార్టీ జరుగుతుందన్న సమాచారంతో రైడ్ చేయగా, యువకులు కాల్పులు ఓపెన్ చేసినట్లు తెలిసింది. ఈ డ్రగ్స్ పార్టీలో ఏపీకి చెందిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ తో పాటు పైలట్ రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి తదితరులు ఉన్నట్లు సమాచారం. ఎనిమిది మంది వీఐపీలు ఇందులో ఉన్నట్లు సమాచారం. తనిఖీల సమయంలో గన్ ఫైరింగ్ జరిగింది. గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో రోహిత్ రెడ్డి ఫాంహౌస్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. గతంలోనూ రోహిత్ రెడ్డి ఫాంహౌజ్ వార్తల్లో సెన్సేషన్‌గా ఉంది. ఇపుడు మరోసారి హాట్ టాపిక్‌గా



ఉంది. డ్రగ్స్ తీసుకున్న ఎనిమిది మందిని అరెస్టు చేయడంతో పాటు రివాల్వర్, కొకైన్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ టెస్ట్ లో రోహిత్ రెడ్డికి పాజిటివ్ రాగా, ఎంపీ మహేష్‌కు నెగిటివ్ వచ్చినట్లు తెలిసింది.

### వాటీజ్ దిస్.. ట్రంప్
- అమెరికాకు తడిచి మోపెడవుతున్న ఖర్చులు
- యుద్ధానికి ఇప్పటికే 3.1 లక్షల కోట్లు ఖర్చు



02

# మేడ్చల్ జిల్లాలో అమానుషం

- రాజు వెడ్స్ రాంబాబు సినిమా సీన్ రిపీట్
- పెళ్లికి నిరాకరించిందని యువతికి హెచ్ఐవీ ఇంజెక్షన్ ఇచ్చిన ఉన్మాది
- నిందితుడి అరెస్టు

**హైదరాబాద్, మహా :** ప్రేమ ఉన్మాదంగా మారితే ఎంతటి దారుణానికైనా ఒడిగడతారని చెప్పడానికి మేడ్చల్ జిల్లాలో వెలుగు చూసిన ఘటనే నిదర్శనం. సినిమా కథలను తలపించేలా అంతకంటే క్రూరంగా ఒక యువకుడు తన మరదలిపై పగ తీర్చుకున్నాడు. పెళ్లికి నిరాకరించిందన్న కోపంతో ఆమె జీవితాన్ని అంధకారం చేయాలనే దురుద్దేశంతో తనకు ఉన్న ఎయిడ్స్ వ్యాధిని అమెకు కూడా అంటించాడు. బలవంతంగా హెచ్ఐవీ సోకిన రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా



ఎక్కించిన అమానుష ఘటన ఇప్పుడు సంచలనంగా మారింది.

**ప్రేమ పేరిట కక్ష**


పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, మేడ్చల్ జిల్లా అన్నోజి గూడకు చెందిన మనోహర్ అనే యువకుడు తన మరదలిని

మిగతా 2లో

రాష్ట్ర కాంగ్రెస్ కు కుదుపు

## జీవన్న చూపు గులాబీ వైపు

- జగిత్యాల కాంగ్రెస్ లో కలకలం
- కేటీఆర్ తో భేటీకి రంగం సిద్ధం
- ఉగాది తర్వాత బీఆర్ఎస్ కండువా కప్పుకోవాలని నిర్ణయం




వివరాలు 3లో



# జనం కోసం కాదు.. మూసీ చుట్టూ ఉన్న భూముల కోసం

## దిక్కుమాలిన ప్రణాళిక.. ప్రజంటేషన్ తో ఫైరయిన కేటీఆర్




**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.16,000 కోట్లతో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీని అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసిందని, ఉప్పల్, నాగోల్ ప్రాంతాల్లో 6 కి.మీ మేర విజయవంతంగా అభివృద్ధి చేశామని.. అయితే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్షన్నర కోట్ల రూపాయల అంచనాలతో సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ విధ్వంసానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. హిమాయత్ సాగర్ వేదికగా శనివారం "మూసీ పునరుజ్జీవం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి డీటెయిల్స్ ప్లానింగ్ రిపోర్టు లేకుండా.. సోషల్ ఇంఫాక్ట్ స్టడీ.. ఎన్విరాన్ మెంటల్ ఇంపాక్ట్ స్టడీ వంటి నివేదికలు, ప్రజలతో ఎలాంటి చర్చలు లేకుండా వేలమంది ఇండ్లను కూలగొడతామని కాంగ్రెస్ ప్రభుత్వం భయాందోళనకు గురిచేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ చట్టాలను ఇతర నిబంధనలను అన్నింటినీ పాతర వేసి వేలకోట్ల అవినీతికి తెగబడుతున్నదని విమర్శించారు. అభివృద్ధికి తాము ఏమాత్రం వ్యతిరేకం కాదని...అవినీతికి కాంగ్రెస్ పార్టీ భూదాహానికి రేవంత్ రెడ్డి లక్షల కోట్ల అవినీతి ప్రణాళికలకు మాత్రం వ్యతిరేకమని కేటీఆర్ అన్నారు.

### బాధితుల పక్షాన బీఆర్ఎస్

గత ప్రభుత్వంలో కేసీఆర్ పిపిటి ప్రజెంటేషన్ ద్వారా నదుల నీటి వినియోగం ప్రాజెక్టుల నిర్మాణం గురించి వివరిస్తే, రేవంత్ రెడ్డి పిపిటి ద్వారా ఎవరి ఇల్లు ఎట్లా కూలగొట్టాలి, ఎవరి భూములు ఎట్లా లాక్కోవాలి అనే విధ్వంసం గురించి పిపిటి ఇచ్చాడని కేటీఆర్ అన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి స్టార్ హోటల్లో రేవంత్ రెడ్డి పిపిటి ఇస్తే, మూసిని ఎలా అభివృద్ధి చేయవచ్చో బాధితులతో కలిసి బాధితుల పక్షాన ఈరోజు మేము వివరిస్తున్నామన్నారు. ఒక్క ఇల్లు కూలగొట్టకుండా గత ప్రభుత్వం ఆరు కిలోమీటర్ల మూసిని విజయవంతంగా అభివృద్ధి చేసిందన్నారు. నిజాం కట్టించిన అద్భుతమైన జంట జలాశయాలను ఖరాబ్ చేసింది కాంగ్రెస్ పార్టీనేనని దుయ్యబట్టారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాల పాలన ఫలితంగానే మూసి సర్వనాశనం అయిందన్నారు. గతంలో మూసిని మురికి కుప్పగా మార్చిన పాపానికి ప్రజలకు క్షమాపణ చెప్పి పాపాన్ని కడుక్కోవాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

### మూసీ పక్కన ఉన్న భూముల కోసమే ప్లాన్

వందల కిలోమీటర్ల నమామి గంగే కి ఖర్చు కేవలం రూ.42 వేల కోట్లు అయితే, 55 కిలోమీటర్ల మూసీకి లక్షన్నర కోట్లు ఎందుకు ఖర్చవుతుందనే తమ ప్రశ్నకు రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రాన్ని, హైదరాబాద్ నగరాన్ని ప్రేమించే పార్టీగా, వ్యక్తులుగా మూసీ అభివృద్ధిని ఏమాత్రం అడ్డుకోమన్నారు. కానీ కేవలం మూసీ పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును దోచుకుంటామంటే ఖచ్చితంగా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వ్యవహారం చూస్తుంటే మూసీ కోసం కాకుండా, మూసీ పక్కన ఉన్న భూముల కోసం పనిచేస్తున్నాడని... రేవంత్ రెడ్డి స్వయంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే తప్పేమిటి అని అంటున్నారని... గాంధీ విగ్రహం పెడతా అంటున్న రేవంత్ రెడ్డి, గాంధీ మునిమనువడు తుషార్ గాంధీ ఆయన పేరుతో మూసీలో దోపిడీ చేయవద్దని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కేవలం ఎవరు అడ్డుకోవద్దని మహాత్మా గాంధీ విగ్రహాన్ని రేవంత్ రెడ్డి పెట్టే కుట్ర చేస్తున్నాడన్నారు. మూసీ అంశంలో తమ పార్టీది మానవీయ కోణంలో అభివృద్ధి చేసే కార్యక్రమంగా కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఇండ్లను కూల్చి వాటి పునాదుల పైన మూసి ప్రాజెక్టు కట్టడం అన్యాయమన్నారు.

### ఎస్టీపీల నిర్మాణంతోనే..

మూసీ అభివృద్ధిలో భాగంగా మూసీకి ఓఆర్ఆర్ నుంచి ఓఆర్ఆర్ వరకి ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణంతో పాటు, మూసీలో మురికిని మొత్తం తీసివేసేలా ఎస్టీపీల నిర్మాణం కోసం ప్రణాళిక రూపొందించి, ఆ మేరకు రూ.3,800 కోట్లకు పైగా నిధులతో ఎస్టీపీల నిర్మాణం ప్రారంభించామని... వీటి నిర్మాణం పూర్తి అయితే ఒక్క చుక్క కూడా మురికి నీరు మూసి లోకి చేరదన్నారు. దీంతోపాటు గోదావరి నుంచి నీళ్లు తీసుకువచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మూసీలోకి మంచినీళ్లను వదలాలని ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దానికోసం కేవలం రూ.1100 కోట్లతో కొండపోచమ్మ నుంచి నీళ్లు తీసుకు వచ్చే అవకాశం ఉందని... కానీ ఇదే కార్యక్రమానికి అంచనాలను రూ.10 వేల కోట్లకి పెంచి రేవంత్ రెడ్డి కొత్త ప్లాన్ ద్వారా కరప్షన్ కోసం ప్రయత్నం చేస్తున్నాడన్నారు. మూసీని సముద్రంగా అభివృద్ధి చేయడానికి తమకు వచ్చిన అంచనా వ్యయం కేవలం రూ.16,000 కోట్లు మాత్రమేనని... కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఇవన్నీ పక్కన పెట్టి లక్షల కోట్ల రూపాయల ఖర్చు మూసీ పైన పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ప్రభుత్వం బఫర్ జోన్ పేరుతో ప్రజలను భయపెట్టి వారి ఇళ్లను కూలుస్తోందన్నారు. కేవలం డబ్బులు ఉన్న వాళ్లకే బఫర్ జోన్లు ఉంటాయా? రేవంత్ రెడ్డి సొంత ఇల్లు రెడ్డికుంట బఫర్ జోన్‌లో ఉన్నది కదా, దాని గురించి ఎందుకు మాట్లాడటం లేదు? వాళ్ళ సోదరుడి ఇల్లు హైదరాబాద్‌లో బఫర్ జోన్‌లో ఉంది. మంత్రుల ఫామ్ హౌస్‌లు, ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నా ఎందుకు వాటిపై చర్యలు తీసుకోవడం లేదని... ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 20 ఏళ్ల కింద కట్టుకున్న అపార్ట్‌మెంట్‌లను, ఇళ్లను కూలగొడతా అంటున్న రేవంత్ రెడ్డి.. మూసీ బఫర్ జోన్‌లో కడుతున్న రియల్ ఎస్టేట్ సంస్థల అపార్ట్‌మెంట్‌లను మాత్రం ముట్టుకోవడం లేదన్నారు. బఫర్ జోన్ లో ఉన్న వాటిని కులగొట్టి తిరిగి అవే బఫర్ జోన్లో భారీ భవనాలు కట్టేందుకు సిద్ధమయ్యాడన్నారు.

### 3,300 ఎకరాల భూమి పైన కన్నేసి

కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 3,300 ఎకరాల భూమి పైన కన్నేసి మూసీ ప్రణాళికను తెరపైకి తీసుకువచ్చారని కేటీఆర్ ఆరోపించారు. ఈ మొత్తం భూముల విలువ రూ.1,50,000 కోట్లని ...ఈ కోట్ల కోసమే రేవంత్ రెడ్డి ఈ రియల్ ఎస్టేట్ వ్యాపార ఆధారిత మూసీని రూపొందిస్తున్నారని ఆరోపించారు. డిజైన్ చేసే కంపెనీకే రూ. 160 కోట్లను ఇచ్చారంటే ఎంత అవినీతి జరుగుతున్నదో అర్థం చేసుకోవాలన్నారు. మూసీ బాధితుల ఇళ్లకు జీరో విలువ ఉందని బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు దిగవద్దని రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎవరికైనా జీరో విలువ ఉన్నది అంటే అది ముమ్మాటికీ రేవంత్ రెడ్డికే అని కేటీఆర్ అన్నారు. కేవలం రూ. 16,000 కోట్లతో 57 కిలోమీటర్ల మూసీని అభివృద్ధి చేయవచ్చని... వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రణాళికను ముందుకు తీసుకుపోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### మూసీ బాధితుల ఆందోళన.. ఆవేదన

రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికల పైన మూసీ బాధితులు ఆందోళన ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ తమకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో విప్ వివేకానంద గౌడ్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మాజీ మండలి చైర్మన్ స్వామి గౌడ్, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మన్నెగోవర్ధన్ రెడ్డి, పాల్గొన్నారు

# యుద్ధంలో భీభత్సం

(మొదటిపేజీ తరువాయి)



ఇరాన్‌తో జరుగుతున్న భీకర పోరాటంలో అమెరికా కీలక విజయాన్ని సాధించిందని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. శనివారం జరిగిన రక్షణ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ మిలటరీ సామర్థ్యాలను అమెరికా దళాలు 100 శాతం నాశనం చేశాయని స్పష్టం చేశారు. "ఇప్పుడు ఇరాన్ ఒక తల తెగిపడిన దేశంలా మారిపోయింది.. అటువంటి దేశం నుంచి ఇకపై ప్రపంచానికి ఎలాంటి ముప్పు ఉండదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇరాన్ తీర ప్రాంతాలపై అమెరికా దాడులు కొనసాగుతున్నాయని, అతి త్వరలోనే ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని అమెరికా తిరిగి ఓపెన్ చేస్తుందని ట్రంప్ హామీ ఇచ్చారు. హోర్ముజ్ మార్గాన్ని మరింత సురక్షితంగా, స్వేచ్ఛాయుతంగా మారుస్తామని ఆయన ప్రకటించారు. అయితే, ప్రపంచ వాణిజ్య భద్రత దృష్ట్యా ఈ ఆపరేషన్‌లో తమతో చేతులు కలపాలని చైనా, ఫ్రాన్స్, జపాన్, సౌత్ కొరియా, యూకే వంటి దేశాలను ట్రంప్ కోరారు. తమ వాణిజ్య నౌకల రక్షణ కోసం ఆయా దేశాలు వెంటనే యుద్ధనౌకలను పంపాలని ఆయన పిలుపునిచ్చారు.

### నిమిషాల్లో 1,430 మిస్సైళ్లతో ప్రళయం!

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య రెండు వారాలుగా సాగుతున్న యుద్ధం శనివారం రాత్రికి పరాకాష్టకు చేరుకుంది. ఇజ్రాయెల్ జాతీయ అత్యవసర, వైద్య సేవల సంస్థ మాగెన్ డేవిడ్ అడోమ్ ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం.. కేవలం కొద్ది నిమిషాల వ్యవధిలోనే ఉత్తర, దక్షిణ మధ్య ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాలపై ఇరాన్ ఏకంగా 1,430 క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో ముఖ్యంగా దక్షిణ ఇజ్రాయెల్‌లోని ఈలట్ నగరం చిగురుటాకులా వణికిపోయింది. ఇరాన్ ప్రయోగించిన క్లస్టర్ బాంబుల ధాటికి నగరం చుట్టుపక్కల అనేక చోట్ల పేలుళ్లు సంభవించాయి. ఇక్కడ జరిగిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో 12 ఏళ్ల బాలుడి పరిస్థితి విషమంగా ఉందని, శరీరమంతా గాయాలయ్యాయని వైద్యులు తెలిపారు. మరో 39 ఏళ్ల వ్యక్తి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరినీ యోసెఫ్తల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇజ్రాయెల్ యొక్క అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలు గాలిలోనే చాలా క్షిపణులను అడ్డుకున్నప్పటికీ, నిమిషాల్లో వందల సంఖ్యలో మిస్సైళ్లు రావడం వల్ల పెను నష్టం వాటిల్లింది. దేశవ్యాప్తంగా సైరన్లు మోగడంతో ప్రజలు బాంబు షెల్టర్లలో తలదాచుకున్నారు. గత 24 గంటల్లోనే ఇరాన్ దాడుల వల్ల సుమారు 179 మంది పౌరులు గాయపడినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ యుద్ధ పరిణామాల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హోర్ముజ్ జలసంధిని రక్షించడానికి ఇతర దేశాలు కూడా యుద్ధనౌకలను పంపాలని విజ్ఞప్తి చేశారు. యుద్ధం ముదురుతుండటంతో మధ్యప్రాచ్యంలో గ్యాస్, ఆయిల్ సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉందని ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

### ఐదు విమానాలు ధ్వంసం

అమెరికా వాయుసేనకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు తెలుస్తోంది. సౌదీ అరేబియాలోని వైమానిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో యూఎస్ వైమానిక దళానికి చెందిన ఐదు రీఫ్యూయలింగ్ విమానాలు ధ్వంసం అయినట్లు సమాచారం. యూఎస్ అధికారులు ఈ విషయం పేర్కొన్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో వెల్లడించింది. దాని ప్రకారం.. సౌదీ అరేబియాలోని ఎయిర్‌బేస్‌పై జరిగిన దాడుల్లో ఐదు కేసీ135 రీఫ్యూయలింగ్ విమానాలు దెబ్బతిన్నాయి. ట్యాంకర్లు దెబ్బతిన్నప్పటికీ.. అవి పూర్తిగా ధ్వంసం కాలేదు. వాటికి మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని అధికారులు తెలిపారు.

### ఇరాన్ 'ఆర్థిక కిరీటం' ఖర్గ్ ఐలాండ్‌ను కొట్టాం

పశ్చిమాసియా ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకోవడం, అలాగే ఇజ్రాయెల్‌ను పూర్తిగా నాశనం చేయడం ఇరాన్ లక్ష్యమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఆ యత్నాలు ఇప్పుడు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ఇరాన్ చమురుకు వ్యూహాత్మక హబ్ అయిన ఖర్గ్ దీవిపై దాడి చేసినట్లు తెలిపారు. పశ్చిమాసియా చరిత్రలోనే అత్యంత శక్తివంతమైన దాడిగా అభివర్ణించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్ట్ చేశారు. నా ఆదేశాల మేరకు పశ్చిమాసియా చరిత్రలోనే అత్యంత శక్తివంతమైన బాంబుదాడుల్లో ఒకటిని అమెరికా సెంటర్ల కమాండ్ నిర్వహించింది. ఇరాన్‌కు కీలకమైన ఖర్గ్ దీవిలోని ప్రతి సైనిక లక్ష్యాన్ని పూర్తిగా ధ్వంసం చేశాం. ఖర్గ్ దీవిలో ఉన్న చమురు మౌలిక సదుపాయాలను ఉద్దేశపూర్వకంగా దాడి చేయలేదు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఆయుధాలు అమెరికా వద్ద ఉన్నాయి. అయినప్పటికీ కొన్ని కారణాల వల్ల చమురు సదుపాయాలను లక్ష్యంగా చేసుకోలేదు' అని ట్రంప్ రాసుకొచ్చారు.

# వాటీజ్ దిస్.. ట్రంప్

## అమెరికాకు తడిచి మోపడవుతున్న ఖర్చులు

### యుద్ధానికి ఇప్పటికే 3.1లక్షల కోట్లు ఖర్చు

**మహా:** ఇరాన్ తో యుద్ధం అమెరికాను తీవ్ర నష్టాల్లోకి నెట్టింది.యుద్ధం మొదలైన తొలి 24 గంటల్లోనే అమెరికా సుమారు ₹7,000 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి.కేవలం దాడులకే కాకుండా, యుద్ధ నౌకల నిర్వహణకు అమెరికా భారీ మొత్తం చెల్లించాల్సి వస్తోంది. యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి ఒక్కో యుద్ధ విమాన వాహక నౌక నిర్వహణకే రోజుకు ₹59 కోట్లు ఖర్చవుతోంది. యుద్ధానికి ముందే బలగాల మోహరింపు కోసం మరో ₹5,700 కోట్లకు పైగా వెచ్చించినట్లు రక్షణ నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల అమెరికాకు ఆర్థిక భారంతో పాటు సాంకేతిక నష్టం కూడా అమెరికాను కలవరపెడుతోంది. కువైట్‌లో అమెరికాకు చెందిన మూడు యుద్ధ విమానాలు కూలిపోవడం పెద్ద దెబ్బగా మారింది.ఉక్రెయిన్, ఇండోపసిఫిక్ ప్రాంతాల్లో ఇప్పటికే క్షిపణి నిరోధక వ్యవస్థలను మోహరించిన నేపథ్యంలో, ఇరాన్ యుద్ధంలో ఆయుధాలను కోల్పోవడం అమెరికా రక్షణ సామర్థ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. సౌదీలో మరో ఐదువిమానాలను కూల్చారు. 2023 అక్టోబరులో హమాస్ దాడి తర్వాత నుంచి ఇప్పటివరకు పశ్చిమాసియాలో అమెరికా చేసిన మొత్తం ఖర్చు దాదాపు ₹3.1 లక్షల కోట్లు చేరినట్లు బ్రౌన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధం మరో 45 వారాలు కొనసాగవచ్చని ప్రకటించిన నేపథ్యంలో, ఈ ఆర్థిక భారం అమాంతం పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదంతా జరిగితే అమెరికా పూర్తిస్థాయిలో నష్టాలను మూటగట్టుకోక తప్పదు. మరోవైపు వరుసయుద్ధాలు, ప్రపంచదేశాలతో కయ్యాలతో అమెరికా ఆర్థికరంగాన్ని అతలాకుతలం చేస్తున్న ట్రంప్ తీరుపై అమెరికన్లు భగభగలాడుతున్నారు.

# దుబాయ్ బై బై

## యుద్ధభయంతో వెలవెల.. ఒకప్పుడు విలాసం ఇపుడు విలాపం

### ఖాళీగా లగ్జరీ హోటల్స్.. మూతపడ్డ బ్యాంకులు

**మహా:** ఒక్క యుద్ధం దుబాయ్ ను బైబై అనేలా చేసింది. దుబాయ్ అంటేనే ఇపుడు పర్యాటకులు గజగజలాడుతున్నారు. ఇరాన్ ఎఫెక్ట్ తో ఎపుడు ఏ హోటల్ పై డ్రోన్లు, క్షిపణులు విరుచుకుపడతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో లక్షలాది మంది భారతీయులతొ పాటు ఇతర దేశాల వారు కూడా తమ దేశానికి పరుగుతీస్తున్నారు. పశ్చిమాసియాలో చెలరేగిన యుద్ధం ప్రపంచంలోని సంపన్నుల స్వర్గధామమైన దుబాయ్ నగరాన్ని అతలాకుతలం చేసింది. నిత్యం పర్యాటకులు, పెట్టుబడిదారులతో కళకళలాడే ఈ మహానగరం ఇప్పుడు కళావిహీనంగా మారింది. ఒకప్పుడు పెట్టుబడులకు, విలాసవంతమైన జీవితానికి ప్రతీకగా నిలిచిన దుబాయ్ ఇప్పుడు యుద్ధ భయంతో విలపిస్తోంది. యుద్ధ వాతావరణం నేపథ్యంలో దుబాయ్ నగరంలోని ప్రధాన షాపింగ్ మాల్స్, వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. రోడ్లపై జనసంచారం పూర్తిగా నిలిచిపోయింది. ఒకప్పుడు సందర్శకులతో కిటకిటలాడిన బీచ్‌లు ఇప్పుడు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. బుర్జ్ అల్ అరబ్ వంటి ప్రఖ్యాత హోటళ్లపై క్షిపణి దాడులు జరిగాయన్న వార్తలతో ప్రజలు భయంతో ఇళ్లకే పరిమితమయ్యారు. చాలామంది నగరాన్ని విడిచి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. విమాన సర్వీసులు భారీగా రద్దు కావడంతో పర్యాటక రంగం పూర్తిగా కుదేలైంది. సందర్శకులను ఆకర్షించేందుకు హోటళ్లు భారీ డిస్కౌంట్లు ప్రకటించినా స్పందన కరవైంది. సిటీ, స్టాండర్డ్ చార్టెర్డ్ వంటి అంతర్జాతీయ బ్యాంకులు సైతం తమ కార్యాలయాలను మూసివేశాయి. దీంతో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నగరాల్లో ఒకటైన దుబాయ్, ఇప్పుడు యుద్ధం కారణంగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇప్పటికిపుడు కోలుకోవడం కూడా కష్టంగానే కనిపిస్తోంది.

# మేడ్చల్ జిల్లాలో అమానుషం

(మొదటిపేజీ తరువాయి)

కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. ఆమెను వివాహం చేసుకోవాలని భావించినప్పటికీ యువతి కుటుంబ సభ్యులు మాత్రం ఆమెకు వేరే వ్యక్తితో నిశ్చితార్థం జరిపించారు. తన మేన మరదలు తనకు కాకుండా మరో వ్యక్తికి భార్య కాబోతుందన్న నిజాన్ని మనోహర్ జీర్ణించుకోలేకపోయాడు. ఈ అసూయ, కోపం క్రమంగా ఆమెపై పగగా మారింది. ఆమె జీవితాన్ని నాశనం చేయడమే లక్ష్యంగా భయంకరమైన కుట్రకు తెరలేపాడు.

### రాజు వెడ్స్ రాంబాయి సినిమా స్ఫూర్తితో ఘాతుకం

ఈ క్రూరమైన పగ తీర్చుకోవడానికి మనోహర్ ఇటీవల విడుదలైన రాజు వెడ్స్ రాంబాయి అనే తెలుగు సినిమాను ప్రేరణగా తీసుకున్నాడు. ఆ సినిమాలో చూపిన విధంగానే తనకు ఉన్న హెచ్ఐవీ వ్యాధిని ఆ యువతికి అంటించాలని నిర్ణయించుకున్నాడు. యువతి ఇంట్లో పెళ్లి పనులు జరుగుతున్న తరుణంలో ఆమె ఇంటికి వెళ్లి సైలెంట్‌గా హెచ్ఐవీ ఉన్న రక్తాన్ని ఇంజెక్షన్ రూపంలో ఆమె శరీరంలోకి ఎక్కించాడు.

### బయటపడ్డ భయంకర నిజం

ఈ ఘటన జరిగిన కొద్ది రోజుల తర్వాత సదరు యువతి తీవ్రమైన జ్వరంతో అస్వస్థతకు గురైంది. సాధారణ జ్వరమే అని భావించిన తల్లిదండ్రులు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. అయితే వచ్చిన రిపోర్టులను చూసిన వైద్యులు ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. పెళ్లి సిద్ధమవుతున్న ఆ యువతికి హెచ్ఐవీ పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. ఆరోగ్యంగా ఉన్న తమ కుమార్తెకు ఈ వ్యాధి ఎలా సోకిందని ఆరా తీయగా మనోహర్ చేసిన దుశ్చర్య వెలుగులోకి వచ్చింది. మనోహర్ ఉద్దేశపూర్వకంగానే తన రక్తాన్ని ఆమెకు ఎక్కించాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఇప్పుడు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

### నిందితుడు అరెస్టు

బాధిత యువతి, ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడ్చల్ జిల్లా పోచారం పోలీసులు తక్షణమే స్పందించారు. నిందితుడు మనోహర్ ను అదుపులోకి తీసుకుని విచారించగా, పగతోనే ఈ పని చేసినట్టు తేలింది. పోలీసులు అతనిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఒక యువతి భవిష్యత్, ఆమె వైవాహిక జీవితాన్ని అత్యంత క్రూరంగా దెబ్బతీసిన నిందితుడికి కఠినమైన శిక్ష పడాలని స్థానికులు మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పోలీసులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# ఇరాన్ లో పాలన మార్పు సాధ్యం కాదు

## ప్రభుత్వాన్ని కూలదోయలేకపోవడం మా వైఫల్యం కాదు

**జెరూసలేం:** యుద్ధం ద్వారా ఇరాన్‌లో పాలనా మార్పు సాధ్యం కాకపోవచ్చని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. ఆ దేశంలో ఇస్లామిక్ విప్లవ ప్రభుత్వం కూలిపోవాలంటే ఇరాన్ ప్రజలే తిరుగుబాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఇరాన్‌తో యుద్ధం మొదలైన తర్వాత మొదటిసారి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం మీడియాతో మాట్లాడారు. ‘ఇరాన్‌లో ప్రస్తుత ప్రభుత్వాన్ని కూలదోయటానికి అనువైన వాతావరణాన్ని సృష్టించాం. ఇరాన్ సైన్యం, బసీజ్ బలగాలను మా దాడులతో తీవ్రంగా దెబ్బతీసి ప్రతిపక్షాల ఉద్యమానికి అడ్డంకులు తొలగించాం. ఇరాన్ ప్రజలారా.. మీకు స్వాతంత్ర్యం సంపాదించుకొనే గొప్ప అవకాశం వచ్చింది. మేము మీ వెంట ఉన్నాం. మీకు సహాయం చేస్తున్నాం. ఇక మార్పు మీ చేతుల్లోనే ఉంది’ అని స్పష్టంచేశారు. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని కూలదోయలేకపోవటం ఇజ్రాయెల్ వైఫల్యం కాదా? అన్న ప్రశ్నకు ఆయన.. ‘ఇజ్రాయెల్ మనుగడ సాగించాలంటే ఎప్పుడూ శక్తిమంతంగా ఉండాలి’ అని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో డబుల్ డెక్కర్ కారిడార్

## పైన మెట్రో, మధ్యలో నేషనల్ హైవే, కింద అండర్‌పాస్‌లు

### కోకాపేటగా మారనున్న హయత్ నగర్

### రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, ముంబైపూణే నగరాలను కలుపుతూ 3 హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్లు ఇదే ఎల్బీ నగర్, హయత్ నగర్ ప్రాంతం నుంచే రానున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. రానున్న రోజుల్లో హయత్ నగర్, ఇబ్రహీంపట్నం ప్రాంతాలు కోకాపేటలాగ మారనుందన్నారు. అదే విధంగా హైదరాబాద్ విజయవాడ మధ్య 10 లేన్ల రహదారి పనులను కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు.

### మూసీ ప్రక్షాళనపై రాద్ధాంతం తగదు

మూసీ నది ప్రక్షాళనపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. మూసీ నదిలో పారే విషపూరిత జలాలతో నల్గొండ ప్రజలు 30 ఏళ్లకే ముసలివాళ్ల లాగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నీ, క్యాన్సర్ లాంటి భయంకర రోగాలతో తీవ్ర అవస్థలు పడుతున్నారని వెల్లడించారు. మానవత్వంతో నల్గొండ ప్రజల గోసను అర్థం చేసుకోండి అంటూ విజ్ఞప్తి చేశారు. మురికి కూపంలా మారిపోయిన మూసీ నదిలో మంచి నీటిని పారేలా చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. మూసీ



పునరుజ్జీవం ప్రాజెక్టును పూర్తి అయితే.. భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని.. మూసీ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఇల్లు కోల్పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# కేజ్రీవాల్‌కు ఏటీఎంలా పంజాబ్ ప్రభుత్వం

## కేంద్రమంత్రి అమిత్ షా

**మహా:** పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. భగవంత్ మాన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ఆ పార్టీ అగ్రనేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఒక ఏటీఎంలా మారిపోయిందని షా ఆరోపించారు. అప్పులు, డ్రగ్స్, అక్రమ మత మార్పిడులు, అవినీతి, గ్యాంగ్‌స్టర్ల అరాచకాలతో పంజాబ్ నాశనమైందన్నారు. మాదకద్రవ్యాల సమస్య నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయగలిగే శక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి మాత్రమే ఉందన్నారు. శనివారం పంజాబ్‌లోని మోగా జిల్లా, కిల్లి చాహ్లాన్ గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. పంజాబ్ ప్రజలు గతంలో కాంగ్రెస్ పార్టీకి, శిరోమణి అకాలీదళ్, ఆమ్ ఆద్మీ పార్టీకి అవకాశాలు ఇచ్చారన్నారని షా గుర్తు చేశారు. 2027 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజల కోసం ఎక్కడికైనా వస్తా: పవన్

**అమరావతి, మహా:** తమది ‘పీపుల్ ఫ్రెండ్లీ ప్రభుత్వం’ అని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామం నందిగరువులో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో ‘మాటమంతి’ కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "గత ప్రభుత్వంలో కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కూడా ప్రజలు భయపడేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగమే మీ గడప వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకునేలా పాలనను ప్రక్షాళన చేశాం. మీరు కష్టాలు చెప్పుకోవడానికి రోడ్ల మీదకు రాకముందే వాటిని పరిష్కరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని భరోసా ఇచ్చారు.

## రాష్ట్ర కాంగ్రెస్ కు కుదుపు

# జీవన్న చూపు గులాబీ వైపు

**జగిత్యాల, మహా :** కాంగ్రెస్ సీనియర్ నేత తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ మారే అవకాశం కనిపిస్తోంది. జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో జీవన్ రెడ్డికి, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు మధ్య ఎప్పటి నుంచో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వైరం ఉంది. గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ బీఆర్ఎస్ నుంచి గెలవగా, జీవన్ రెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే, అనూహ్యంగా సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకు ప్రభుత్వం , పార్టీలో ప్రాధాన్యత పెరగడం జీవన్ రెడ్డికి మింగుడుపడటం లేదు. తనను సంప్రదించకుండానే బద్ధ శత్రువును పార్టీలోకి తీసుకోవడం తనను అవమానించడమేనని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. పార్టీపై ఆయన చాలా కాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

**కేసీఆర్‌తో భేటీకి రంగం సిద్ధం**

ఇటీవల ఆయన తాను పార్ట మారే ఆలోచనలో ఉన్నానని చెబుతున్నారు. ఈ క్రమంలో జీవన్ రెడ్డి ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నెల 20వ తేదీ తర్వాత ఆయన హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి, గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉంది. ఇప్పటికే జగిత్యాలలోని తన అనుచరులతో, కీలక నేతలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ మార్పుపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ పూర్తి చేశారని, మెజారిటీ అనుచరులు ఆయన నిర్ణయానికి మద్దతు తెలిపారని సమాచారం.

**కాంగ్రెస్ బుజ్జగింపులు విఫలం**

జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీ వీడకుండా ఉండేందుకు కాంగ్రెస్ అధిష్టానం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి బుజ్జగించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ, సంజయ్ కుమార్ విషయంలో తనకు జరిగిన అన్యాయాన్ని ఆయన గట్టిగా ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడితే, ప్రత్యర్థిని తెచ్చి నెత్తిన కూర్చోబెట్టడం ఏమిటి అని ఆయన తన సన్నిహితుల వద్ద వాపోయినట్లు సమాచారం. ఈ పరిణామక్రమాలతో ఆయన వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదని చెబుతున్నారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే, జగిత్యాల నియోజకవర్గంలో సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. కాంగ్రెస్ కేడర్‌లో చీలక రావడం ఖాయం. అటు బీఆర్ఎస్‌కు ఈ సీనియర్ నేత రాక పెద్ద బలాన్ని ఇస్తుందని ఆ పార్టీ భావిస్తోంది. పార్టీ మారే అంశంపై జీవన్ రెడ్డి నుంచి త్వరలోనే ఒక అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ కీలక నేత**

కాంగ్రెస్ పార్టీతో తాటిపర్తి జీవన్ రెడ్డికి దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా విడదీయలేని అనుబంధం ఉంది. 1980వ దశకంలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, జగిత్యాల నియోజకవర్గం నుండి ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ఆ ప్రాంతంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లు, భవనాల శాఖ వంటి కీలక మంత్రి పదవులను నిర్వహించిన జీవన్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు. ఓటమి ఎదురైనప్పుడు కూడా పార్టీని వీడకుండా విధేయుడిగా ఉన్న ఆయన తెలంగాణ ఉద్యమం తర్వాత వెనుకబడిపోయారు. వరుసగా ఓడిపోతూ వస్తున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసినా ఓడిపోయారు.

## గ్యాస్ కృత్రిమ కొరత సృష్టిని ఆపాలి

**రేణుక అక్షర మహిళా మండలి డిమాండ్..**



**మణుగూరు, మహా :** రాష్ట్రంలో కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల కొరత తీవ్రంగా పెరిగిపోతున్న నేపథ్యంలో కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మణుగూరు పట్టణంలోని రేణుక అక్షర మహిళా మండలి డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం మండలి ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇటీవల పశ్చిమాసియా యుద్ధ పరిణామాల కారణంగా గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందనే సమాచారం ఉందన్నారు. దీనివల్ల ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, ప్రభుత్వ వసతి గృహాలు వంటి వాణిజ్య రంగాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కమర్షియల్ సిలిండర్లనింపే ప్రక్రియ మందగించడం వల్ల చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గల్ఫ్ దేశాల మధ్య సరఫరా అంతరాయం కారణంగా దేశవ్యాప్తంగా ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అయితే కొందరు గ్యాస్ ఏజెన్సీలు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు సిలిండర్లు విక్రయించే ప్రయత్నం చేస్తే వారి లైసెన్సులు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్యాస్ కొరత కారణంగా చిన్న చిన్న హోటళ్లు మూతపడే పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని, అనేక వ్యాపారాలు దెబ్బతినే ప్రమాదం ఉందని మండలి ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. గృహ వినియోగానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, డొమెస్టిక్ గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. అవసరమైతే కమర్షియల్ సరఫరాను తగ్గించి గృహ అవసరాలకు మళ్లించాలని వారు పేర్కొన్నారు.ఇదిలా ఉంటే గ్యాస్ ఏజెన్సీలు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు గ్యాస్ విక్రయిస్తే మణుగూరు తాసిల్దార్ వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని మండలి సభ్యులు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ కొరత నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి ఎండీ షబనా, కన్నాపురం వసంత, రెడ్డీబోయిన రేణుక, దేరంగుల సుజత, కన్నాపురం శైలజ, సౌజన్య డాకూరి, లక్కీశెట్టి హేమలత, బుచ్చల లావణ్య తదితరులు పాల్గొన్నారు.



## 250 మంది ముస్లిం మహిళలకు ఈద్ కా తోఫా పంపిణీ..

- రంజాన్ సోదరభావం, ఐక్యతకు ప్రతీక..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

**మణుగూరు, మహా :** రంజాన్ పండుగ సందర్భంగా మణుగూరు మండలానికి చెందిన 250 మంది ముస్లిం మహిళలకు ఈద్ కా తోఫాలను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. శనివారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రంజాన్ పండుగ సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర ప్రేమాభిమానాలతో, సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సామరస్య వాతావరణం కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, ఆర్ఐ గోపి, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మైనార్టీ సెల్ అధ్యక్షులు రహీం పాషా, 14 టైర్ లారీ అసోసియేషన్ అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాస్ రెడ్డి, 12 టైర్ లారీ అసోసియేషన్ సెక్రెటరీ సురేందర్ రెడ్డి, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, కట్టు మల్లారం సర్పంచ్ జిగిడి ప్రసాద్, లంక మల్లారం సర్పంచ్ పూణెం రమేష్, విప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, వార్డు సభ్యులు కోలపిన్ని మానస, ఎస్.కె. రహీం భాషా, బర్ల శ్వేత, పోలమూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- అవినీతి రాజకీయాలపై అలుపెరగని పోరాటమే జనసేన సిద్ధాంతం
- మండల పార్టీ అధ్యక్షుడు ఉసికల రమేష్

**జూలూరుపాడు, మహా:** జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి చంద్రుగొండ క్రాస్ రోడ్డు లోని పార్టీ దిమ్మె వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉసికల మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించటం జరిగిందన్నారు. అవినీతి రాజకీయాలపై అలుపెరుగని పోరాటమే జనసేన పార్టీ సిద్ధాంతమని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను మండల వ్యాప్తంగా ప్రజలలోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేసేందుకు జన సైనికులంతా అలుపెరగని కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు చలమల విజయ్, పురేటి జోగారావు, తాటికొండ చలపతి, వడ్డే పవన్, గణప సాయి, రేపాల నవీన్, సారంగి మల్లికార్జున్, రేగుముడి పుల్లారావు, మద్దిబోయిన యల్లేశ్వరరావు, యాస రాకేష్, మంద కమలాకర్, బాబురావు సాయి, తోట విజయ్ కుమార్, అప్పాల గిరిధర్, వడ్డే గురు ప్రసాద్, అయినవెల్లి శ్యాంసుందర్ తోపాటు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

## ఏఐటియుసి ఆధ్వర్యంలో.. సేవ్ సింగరేణి జాత పోస్టర్ ఆవిష్కరణ..



**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ వర్కర్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న సేవ్ సింగరేణి జాత పోస్టర్‌ను శనివారం యూనియన్ నాయకులు మణుగూరులో ఆవిష్కరించారు. మణుగూరులోని పీవీ కాలనీ కేఎల్ మహేంద్ర భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు మాట్లాడుతూ.. మార్చి 17న శ్రీరాంపూర్‌లో ప్రారంభమయ్యే సేవ్ సింగరేణి జాత సింగరేణిలోని అన్ని ఏరియాల గుండా ప్రయాణించి మార్చి 30న కొత్తగూడెంలో ధర్నా కార్యక్రమంతో ముగుస్తుందని తెలిపారు. సింగరేణిలో కొత్త బొగ్గు బావులను ప్రారంభించాలని, పాత విధానంలో మెడికల్ బోర్డును నిర్వహించాలని, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.50 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని, పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ కంపెనీ చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఐపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని కోరారు. మారు పేర్లు, డిస్మిస్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు స్ట్రక్చర్ సమావేశాల్లో ఒప్పుకున్న అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం నిర్వహించే జాత కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మణుగూరు ఏరియాలో డిప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె అనివార్యం అవుతుందని హెచ్చరించారు. కార్మికులందరూ పోరాటానికి సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ కామ్రేడ్ పుల్లారావు, ఆఫీస్ బేరర్ కామ్రేడ్ అవుల నాగరాజు, పిట్ సెక్రటరీలు గుంపెన శ్రీనివాసరావు, వర్క్‌మెన్ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు జానకి ప్రసాద్, తెన్నిటి నారాయణ, ఇమామొద్దీన్, కళ్యాణం రవికుమార్, యాకూబ్ పాషా, నీరుడు వెంకట్ నారాయణ, మట్టపర్తి నాగరాజు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి, ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి..

**ఎమ్మెల్యే పాయంకు సిఐటియు వినతి..**



**మణుగూరు, మహా :** అంగన్వాడీ, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు సీనియర్ నాయకులు నెల్లూరు నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు శనివారం మణుగూరు ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కనీస వేతనాల పెంపుదలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది తక్కువ వేతనాలతో పనిచేస్తూ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే వారి వేతనాలను పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పని పరిస్థితులను మెరుగుపరచడంతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, కొడిశాల రాములు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు బి. శ్యామల, హేమలత, ప్రమీల, యశోద, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపతమ్మ, శిరీష, సావిత్రి, లోహిత, కళావతి, గ్రామ పంచాయతీ నుంచి రంగా, సదానందం, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## పినపాకలో పదవ తరగతి విద్యార్థులకు ఫ్రూటీ జ్యూస్ పంపిణీ

**పినపాక ,మహా:** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పినపాక యూత్ సభ్యులు ఫ్రూటీ జ్యూస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 350 మంది విద్యార్థులకు జ్యూస్ పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్షలు రాస్తూ అలసట, దప్పిక లేకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోతోగూడెం సర్పంచ్ పూణెం వెంకటేశ్వర్లు,సామాజిక కార్యకర్త కోడి రెక్కల సాయికుమార్,పినపాక యూత్ సోంపల్లి కుమారస్వామి, రెబ్బల పురుషోత్తం, మొగిలి ఉపేందర్, వీర మోహన్, సతీష్, సంతోష్, ప్రసాద్, రాజమళ్ళ సాంబశివరావు, , చిట్టి మల్ల సతీష్ చారి తదితరులు పాల్గొన్నారు

## ఆర్థిక అభివృద్ధిలో మహిళలు ముందుండాలి

- మహిళల సంక్షేమ కోసం నవ లిమిటెడ్ కృషి అభినందనీయం
- డాక్టర్ కిషోర్ రెడ్డి
- మహిళా సాధికార కేంద్రంలో యోగ్యత పత్రాల బహుకరణ చెక్కుల పంపిణీ



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** మహిళల అభివృద్ధికి పాల్వంచ నవ లిమిటెడ్ చేస్తున్న కృషి అభినందనీయమని డాక్టర్ కిషోర్ రెడ్డి కొనియాడారు. నవ లిమిటెడ్ సేవకు చిరునామాగా నిలుస్తుందని పేర్కొన్నారు. నవ లిమిటెడ్ పాల్వంచ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన నవ మహిళా సాధికార కేంద్రం నందు బ్యూటీషన్, టైలరింగ్, ఆఫీస్ ఆటోమేషన్ కంప్యూటర్ ఎంబ్రాయిడరీ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శనివారం యోగ్యత పత్రాల ప్రధాన బహుకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా డాక్టర్ ఎన్.కిషోర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఏదగడానికి ' నవ' చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం ఎమ్. శ్రీనివాసరావు, మహిళా సాధికార కేంద్ర ప్రతినిధి మాట్లాడుతూ ఈ మహిళా సాధికార కేంద్రంలో ఇప్పటివరకు 4600 మందికి పైగా వివిధ కోర్సుల లో శిక్షణ పూర్తి చేసుకున్నారని, అలాగే 75 శాతం మంది మహిళలు సొంతగా ఇంటిలో టైలరింగ్, బ్యూటీషన్ పనులు చేసుకుంటున్నారని మరికొంత మంది సొంత వ్యాపారాలు చేపట్టారని తెలిపారు.ఈ సందర్భంగా బ్యూటిషన్ కోర్సులో శిక్షణ తీసుకున్న ఆర్.నందిని మాట్లాడుతూ మహిళా సాధికార కేంద్రం తమ లాంటి వారికి ఎందరికో ఉచిత శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు.అతిధుల చేతులమీదుగా బ్యూటీషన్, టైలరింగ్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, ఆఫీస్ ఆటోమేషన్ యోగ్యత పత్రాలు దుస్తుల తయారీ, తాటాకుల బుట్టల తయారీ ద్వారా రూ.1,07,641 వచ్చిన నగదు చెక్కులను పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ వెంకటేశ్వర్లు రిటైర్డ్ హెడ్ మాస్టర్, ఏ.శ్రీనివాస్ రెడ్డి డి.జి.ఎమ్ (హెచ్ ఆర్ అండ్ ఏ), ఆముద, టి.అరుణ, బి.అరుణ, కవిత, దివ్య, శిరీష, రాజేశ్వరావు, రాజేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కిష్టారం గ్రామసభలో రభస

- సింగరేణి వసతి గృహాలకు గ్రామం మీదుగా 32 కే.వి విద్యుత్ లైన్ తిరస్కరణ.
- గ్రామ సభలో అంబేద్కర్ నగర్ శైలో బంకర్ బాధితుల ఆందోళన.
- గ్రామస్తుల నిర్ణయం మేరకు నడుచుకోవాలని సింగరేణి అధికారులకు మట్టా దయానంద్ సూచన



**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సభలో గ్రామంలో ఏర్పాటు చేసిన సింగరేణి ఉన్నత అధికారుల గృహ సముదాయాలకు గ్రామం మీదుగా 32కె.వి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని దానికి గ్రామస్తులు సహకరించాలని సింగరేణి అధికారులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను గ్రామస్తులు ముక్తకంఠంతో నిరాకరించారు. తమ గ్రామం మీదుగా అధిక తీవ్రత గల విద్యుత్ తీయగలను ఏర్పాటు చేయవద్దని, సింగరేణి కార్యకలాపాలతో తమ గ్రామం తీవ్రంగా నష్టపోయిందని, కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమపై విద్యుత్ రేడియేషన్ తో మరో ఇబ్బందులకు గురి చేయొద్దని సింగరేణి అధికారులకు తేల్చి చెప్పారు. మాజీ ప్రజా ప్రతినిధుల అవగాహన లోపంతో గ్రామంలోని అంబేద్కర్ నగర్ కాలనీకి సమీపాన నిర్మించిన శైలో బంకర్ కాలుష్యంతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ఆ సమస్యను పరిష్కరించకుండా మరో సమస్య మా గ్రామంపై తేవద్దని ఉద్ఘాటించారు. గ్రామ సభకు హాజరైన అంబేద్కర్ నగర్ కాలనీవాసులు మాట్లాడుతూ మూడు నెలలలో ఎస్సీ,బీసీ కాలనీలకు శైలో బంకర్ సమస్య నుండి శాశ్వత పరిష్కారం చూపిస్తామని 34 రోజుల మహా ధర్నాను సింగరేణి అధికారులు, ప్రభుత్వ నాయకులు విరమింప చేశారని, సంవత్సరం గడిచిన తమ సమస్యకు పరిష్కారం లేదని ఆందోళనకు దిగారు. సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తే కాలనీవాసుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని, తర్వాత జరిగే నష్టానికి సింగరేణి సంస్థ బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ ప్రభుత్వ రంగ సంస్థ ఆ సంస్థకు భూగర్భ నిక్షేపాలు త్రవ్వి తీసుకోవడం పై ఎంత అధికారం ఉందో తవ్వకాలలో నష్టపోయిన బాధితులను ఆదుకునే బాధ్యత అంతకంటే ఎక్కువ ఉన్నదని గుర్తు చేశారు. సింగరేణి అధికారుల గృహ సముదాయలకు 32 కె.వి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంలో ప్రజల అభిప్రాయమే శిరోధార్యమని, ప్రజల నిర్ణయాన్ని గౌరవించాలని సింగరేణి అధికారులకు సూచించారు. అంబేద్కర్ నగర్ శైలో బంకర్ కాలుష్యం సమస్య గురించి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఈనెల జరగనున్న శాసనసభ సమావేశాలలో మరోసారి ప్రస్తావించి జిల్లా మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తారని దయానంద్ అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జే.వి.ఆర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్, ఎలక్ట్రికల్ ఏ.ఈ శరత్, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈపి ఆపరేటర్లకు ఏ-గ్రేడ్ పదోన్నతులు ఇవ్వాలి

**ఏరియా డీజీఎం పర్సనల్ కు వినతి..**

**మణుగూరు, మహా :** కొత్తగూడెం రీజియన్‌లో ఈపి ఆపరేటర్లకు ఏగ్రేడ్ పదోన్నతుల ఖాళీల భర్తీ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం మణుగూరు ఏరియా డీజీఎం (పర్సనల్) సలగల రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఈపి ఆపరేటర్ల నాయకుడు ఎస్ డి నాసర్ పాషా మాట్లాడుతూ.. కొత్తగూడెం రీజియన్ పరిధిలోని మణుగూరు, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల్లో గత సంవత్సరం సెప్టెంబర్ నాటికి బిగ్రేడ్‌లో మూడు సంవత్సరాల సేవ పూర్తి చేసిన అర్హులైన ఆపరేటర్లు ఉన్నారని తెలిపారు. వారికి ఏగ్రేడ్ పదోన్నతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏరియా యాజమాన్యాన్ని కోరారు. అర్హత సాధించిన బిగ్రేడ్ ఆపరేటర్లకు త్వరితగతిన పదోన్నతులు ఇవ్వడం ద్వారా ఉద్యోగుల్లో ఉత్సాహం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆపరేటర్లు తమ సమస్యలను డీజీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోరారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్లు మొహమ్మద్ హాజీమియా, వనజర్ల సాయిబాబా, మహబూబ్ జానీ, ఎండి తాజ్, భూక్య అంజయ్య, భానోత్ హాథిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు టు ఈ బయ్యారం బీటీ రోడ్డు పనులకు శ్రీకారం..



**ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం..**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో ప్రజల చిరకాల వాంఛ అయిన మణుగూరు నుంచి భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) మీదుగా ఏడుల్ల బయ్యారం క్రాస్ రోడ్ వరకు ఉన్న ప్రధాన రహదారి పునరుద్ధరణ పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శ్రీకారం చుట్టారు. రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలోని బీటీ రోడ్డు పనులను ఆయన శనివారం ప్రారంభించారు. గత కొద్ది నెలలుగా ఈ రహదారి భారీ గుంతలతో అధ్వానంగా మారి వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు, పాఠశాల బస్సులు, విద్యార్థులు, బీటీపీఎస్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల సౌకర్యార్థం రహదారుల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి అధికారి సతీష్, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకుడు సామా శ్రీనివాస్ రెడ్డి, 14 టైర్ అధ్యక్షుడు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, 12 టైర్ కార్యదర్శి సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తాటి భిక్షం, అబ్దుల్లా, చూపుడు శ్రీను తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నర్సరీలో మొక్కల పెంపకం

**పరిశీలించిన సర్పంచ్, ఉప సర్పంచ్ లు..**

**మణుగూరు, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీలో మొక్కల పెంపక కార్యక్రమాన్ని గ్రామ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ నర్సరీలో పెంచుతున్న మొక్కల పరిస్థితిని పరిశీలించారు. అలాగే నర్సరీలో కలుపు, పిచ్చి మొక్కలను తొలగించే పనులను పరిశీలిస్తూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నర్సరీ పరిసర ప్రాంతాల్లో శుభ్రత పాటించాలని పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా గ్రామాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నర్సరీలో పెంచుతున్న మొక్కలను సంరక్షించాల్సిన అవసరం ఉందని గ్రామ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కోలపిన్ని మానస, మంగతాయారు, వజ్జా వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఎస్కే ఇస్మాయిల్ పాషా, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి ఏర్పాట్లకు సిఎస్ఆర్ సంస్థల సహకారం అవసరం

**జిల్లా కలెక్టర్ అంకిత్**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాచలంలో ఈ నెల 27న నిర్వహించనున్న శ్రీరామ నవమి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్) సంస్థల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఐటీసీ, నావా లిమిటెడ్, కేటీపీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సింగరేణి, టీజీ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు గతంలో అందించిన సహకారం ఈ సంవత్సరం అందించనున్న సహాయంపై వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలంలో జరిగే శ్రీరామ నవమి వేడుకలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. భక్తులకు తాగునీరు, అన్నదానం, వసతి, పారిశుద్ధ్యం వంటి అవసరమైన సౌకర్యాలు మెరుగ్గా కల్పించేందుకు సి ఎస్ ఆర్ సంస్థలు తమవంతు సహకారం అందించాలని కోరారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈఓతో సంప్రదించి అవసరమైన ఏర్పాట్ల వివరాలను సేకరించాలని ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ)సంజీవరావును ఆదేశించారు. ఆ అవసరాల మేరకు సి ఎస్ ఆర్ సంస్థల సహకారాన్ని సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# మూసీ తీరంలో సవాళ్ళు

**రాజకీయాల్లో ప్రతి అడుగు ఒక వ్యూహం, ప్రతి మౌనం ఒక సంకేతం. ఇటు భాగ్యనగర గుండెకాయ లాంటి మూసీ నది ప్రక్షాళన నుండి, అటు పశ్చిమాసియాలో ముసురుకుంటున్న యుద్ధ మేఘాల వరకు.. ప్రస్తుత పరిణామాలు సామాన్యుడి బతుకు చిత్రంపై ప్రభావం చూపుతున్నాయి. మూసీ నిర్వాసితుల, పరివాహక ప్రజల గుండెల్లో రైళ్ళు పరుగెత్తిస్తుండగా, యుద్ధం ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తోంది. సంపన్నదేశం దుబాయ్ రాత మార్చేయగా, అయిల్ అమ్ముకుని బతికిన గల్ఫ్ దేశాలు గజగజలాడుతున్నాయి. మూసీపై ఎవరి పట్టుదల ఫలిస్తుంది? యుద్ధ పద్మవ్యూహం నుండి అమెరికా ఎలా బయటపడుతుంది? రాజకీయాల్లో ఏ నిర్ణయమైనా అగ్నిపరీక్ష లాంటిదే. రేవంత్ రెడ్డి పట్టుదల మూసీని పునీతం చేస్తుందా? చంద్రబాబు వ్యూహం ఏపీలో క్లీన్ స్వీప్ కు దారి తీస్తుందా?**

**- ఎఎన్ఎన్, మహాపత్రికల సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్



### మూసీ ప్రక్షాళన.. ముఖ్యమంత్రి పట్టుదల

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'మూసీ రివర్ ఫ్రంట్' ప్రాజెక్టు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్. మార్చి 13న జరిగిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి దీనిపై పూర్తి స్పష్టతనిచ్చారు. మూసీ చుట్టూ ముసురుకుంటున్న వివాదాలపై స్పష్టతనిచ్చే ప్రయత్నం చేశారు. ఈ ప్రాజెక్టు ఎందుకు అవసరమో తేల్చిచెప్పారు. కేవలం అందం కోసం కాకుండా, పర్యావరణ పరిరక్షణ , ఆర్థిక వనరుగా మూసీని మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. గాంధీ సరోవర్ ప్రాజెక్టు దీనికి తొలి మెట్టు. నిధుల సమీకరణ కంటే ఎక్కువగా ఆక్రమణల తొలగింపు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. వేల కోట్ల వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టును 36 నెలల్లో పూర్తి చేస్తామన్న పట్టుదల కార్యరూపం దాల్చాలంటే విపక్షాల విమర్శలను, బాధితుల నిరసనలను అధిగమించాల్సి ఉంటుంది. ఇది సీఎంకు పెద్దసవాల్. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం సవాళ్ళు ఎదుర్కొన్నట్లు ఈ ప్రభుత్వం మూసీపై సవాళ్ళను ఎదుర్కొంటున్నది. అయితే నిర్వాసితుల బాధ పెద్దది. అది ఆస్తికి, స్థలం వాల్యూకు సంబంధించినది కాదు. జీవితాలకు సంబంధించినదని ప్రభుత్వం మనసుతో ఆలోచించాల్సిన అవసరముంది. ప్రతిపక్షాలు దీనిని అస్త్రంగా తీసుకుని సర్కారును ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లోనూ మూసీ ప్రాజెక్టు అంశంపై పెద్ద ఎత్తున చర్చకు పట్టుబట్టాలని విపక్షాలు నిర్ణయించాయి.

### జీహెచ్ఎంసీ ఎన్నికలు: కాంగ్రెస్ గురి.

ముందున్న గ్రేటర్ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ తన పావులను కదుపుతోంది. మూసీ ప్రక్షాళనను ఒక అభివృద్ధి అజెండాగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా నగరంపై పట్టు సాధించాలని భావిస్తోంది. బిఆర్ఎస్, బిజెపిలు దీనిని ప్రతిఘటిస్తున్న వేళ, అహ్మదాబాద్ సబర్మతి రివర్ ఫ్రంట్ పర్యటనలు, అధ్యయనాలు కేవలం ప్రచారం కోసమేనా లేక నిజమైన మార్పు కోసమా అన్నది కాలమే నిర్ణయించాలి.

### వెలుగుమట్ల ఎపిసోడ్: ప్రభుత్వానికి తలనొప్పిగా మారిందా?

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూదాన్ భూముల ఆక్రమణల తొలగింపు ఉదంతం ప్రభుత్వంపై కొంత వ్యతిరేకతను తెచ్చింది. విపక్షాలు దీనిని ఒక ఆయుధంగా మలుచుకోవడంతో, ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలకు దిగింది. 412 మంది బాధితులకు ఇంటి పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకోవడం ద్వారా ఆ సెగను చల్లార్చే ప్రయత్నం చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో ఇంకా కొంత అసంతృప్తి మిగిలే ఉంది.

### లొంగుబాటలో..

తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం" అన్న నినాదం ఇప్పుడు గతం కాబోతుందా? మార్చి 7న 130 మంది మావోయిస్టులు ముఖ్యమంత్రి సమక్షంలో లొంగిపోవడం ఒక చారిత్రాత్మక పరిణామం. అడవుల్లో తుపాకీ పట్టిన చేతులు ఇప్పుడు ప్రజాస్వామ్య బాట పడుతున్నాయి. వీరిలో కొందరు భవిష్యత్తులో ఎన్నికల బరిలో నిలుస్తారన్న ప్రచారం జోరందుకుంది. ప్రభుత్వ విధానం: ఆకర్షణీయమైన పునరావాస పథకాలతో వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడంలో ప్రభుత్వం సఫలమైంది. గణపతి లాంటి అగ్రనేతలను కూడా బయటకు రావాలని ప్రభుత్వం కోరడం ఆసక్తికరం.

### ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం: భారత్ పై పెను ప్రభావం

అంతర్జాతీయంగా చూస్తే ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం భారత్ కు మేలు కంటే కష్టాలనే తెచ్చిపెట్టింది. ముడి చమురు ధరలు బ్యారెల్ కు 120 డాలర్లు దాటడం, ఎల్పీజీ ధరలు పెరగడం సామాన్యుడిపై భారాన్ని మోపాయి. హోర్ముజ్ జలసంధి మూసివేతతో సరఫరా గొలుసు దెబ్బతింది. చౌకగా లభించే ఇరాన్ చమురుకు బ్రేకులు పడటం భారత్ ఎనర్జీ సెక్యూరిటీకి సవాలుగా మారింది.

## ఏపీలో స్థానిక సమరం: రంగం సిద్ధం

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మరో ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఏప్రిల్ 2న మంత్రుల పనితీరు నివేదికలు సిద్ధం కావాలని ఆదేశించడం, కూటమి పక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు మొదలవ్వడం చూస్తుంటే ఏపీలో మళ్ళీ 'స్థానిక' పోరు మొదలైనట్టే కనిపిస్తోంది. గతానికి భిన్నంగా చంద్రబాబు ఈ దఫా ఎక్కువగా ప్రజలతో కనెక్ట్ కావడానికి ప్రయత్నిస్తున్నారు. గతంలో అధికారంలో ఉన్నపుడు మిస్ అయిన కనెక్టివిటీని ఈసారి మిస్ చేయడం లేదు. వ్యూహాత్మకంగా, పట్టుదలగా వ్యవహరిస్తున్నట్లు కనబడుతోంది.


## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999



## కొండారెడ్డిపల్లి నుంచి హార్వర్డ్ వరకు...

# సీఎం రేవంత్ రెడ్డి అసాధారణ ప్రస్థానం

రాజకీయాల్లో నాయకత్వం ఒక్క రోజులో ఏర్పడదు. అది కాలం, కష్టం, పోరాటం, ప్రజల విశ్వాసం కలిసినప్పుడు మాత్రమే రూపుదిద్దుకుంటుంది. ప్రజల మధ్య నుంచి ఎదిగి, వారి ఆశయాలను అర్థం చేసుకుంటూ, క్రమంగా వారి విశ్వాసాన్ని సంపాదించి రాష్ట్రాన్ని నడిపించే స్థాయికి చేరుకోవడం అరుదైన ప్రయాణం. తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం అలాంటి అరుదైన కథలలో ఒకటి. రేవంత్ రాజకీయ ప్రస్థానం వెనుక ఆయన తల్లి ఆశీర్వాదం ఉందని కచ్చితంగా చెప్పవచ్చు. చిన్న తనంలోనే ఆయన తల్లిగారు “నా కొడుకు ఒక రోజు రాజ్యాన్ని ఏలుతాడు” అని నిత్యం అంటుండేవారని రేవంత్ సన్నిహితులు చెబుతుంటారు. ఆ మాటలను సత్యం చేస్తూ ఒక సాధారణ గ్రామీణ కుటుంబంలో జన్మించిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం నిజంగా గొప్ప చరిత్రే.

మహబూబ్‌నగర్ జిల్లా కొండారెడ్డిపల్లి అనే చిన్న గ్రామంలో జన్మించిన రేవంత్ రెడ్డి, రాజకీయాల్లో సాధారణ కార్యకర్తగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. గ్రామీణ జీవితం, పరిమిత అవకాశాలు, ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ ఆయన మాత్రం స్పష్టమైన వైఖరీతో లక్ష్యాలను ఛేదించారు. అదే పట్టుదల ఆయనను ఈ రోజు తెలంగాణ ముఖ్యమంత్రిగా నిలబెట్టింది. అంతేకాదు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ విశ్వవిద్యాలయం వేదికపై తెలంగాణ అభివృద్ధి గురించి మాట్లాడే స్థాయికి ఆయన చేరుకోవడం ఆ ప్రయాణానికి ప్రతీకగా నిలిచింది. ఇది కేవలం ఒక వ్యక్తి ఎదుగుదల కథ మాత్రమే కాదు. కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే సాధారణ కార్యకర్త కూడా ఎంత ఎత్తుకు ఎదగగలరో స్ఫూర్తినిచ్చే ఉదాహరణ.

గ్రామీణ వాతావరణంలో పెరిగిన రేవంత్ రెడ్డి చిన్నప్పటి నుంచే సమాజ సమస్యలను దగ్గరగా చూశారు. రైతుల ఇబ్బందులు, నీటి సమస్యలు, గ్రామీణ యువతకు అవకాశాల కొరత వంటి అంశాలు ఆయనను ప్రభావితం చేశాయి. ఈ అనుభవాలే ఆయనను ప్రజా జీవితానికి దగ్గర చేశాయి. యువకుడిగా ఉన్నప్పుడు గ్రామ సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొనడం ద్వారా ఆయన ప్రజల విశ్వాసాన్ని పొందారు. రాజకీయాల్లో ఆయన తొలి అడుగు స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రారంభమైంది. 2006 లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి జెడ్పీటీసీ సభ్యుడిగా గెలవడం ఆయన రాజకీయ జీవితానికి పునాది వేసింది. గ్రామ స్థాయి నుంచి ప్రారంభమైన ఈ ప్రయాణం తరువాత జిల్లా, రాష్ట్ర స్థాయికి విస్తరించింది.



రాజకీయాల్లో తన ప్రతిభను చాటుకున్న రేవంత్ రెడ్డి తరువాత తెలుగు దేశం పార్టీలో చేరారు. 2008లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఇది ఆయనకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చిన కీలక ఘట్టం. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. తెలంగాణ రాజకీయాలు కొత్త దశలోకి ప్రవేశించిన సమయంలో ఆయన అసెంబ్లీలో చేసిన ప్రసంగాలు, ప్రభుత్వంపై చేసిన విమర్శలు ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. ధైర్యంగా మాట్లాడే స్వభావం, ప్రజా సమస్యలపై స్పష్టమైన వైఖరితో స్పందించడం ఆయనను యువ నాయకుడిగా ప్రజల్లో నిలబెట్టాయి. ఆ కాలంలో తెలంగాణ రాజకీయాల్లో ఆయన పేరు తరచుగా చర్చకు వచ్చింది.


రాజకీయాల్లో విజయం ఎంత విశ్వాసం కలిగిస్తుంది. అదే సమయంలో ఓటమి కూడా ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతుంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన రేవంత్ రెడ్డి ఓటమి చవిచూశారు. సాధారణంగా ఇలాంటి ఓటమి ఒక నాయకుడి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. కానీ రేవంత్ రెడ్డి విషయంలో అది ఒక ప్రారంభంగా మారింది. ఆ ఓటమి ఆయనను మరింత ధైర్యంగా మార్చింది.

అదే సమయంలో ఆయన రాజకీయ జీవితంలో ఒక కీలక నిర్ణయం తీసుకొని కాంగ్రెస్ పార్టీలో చేరడంతో తెలంగాణ రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్టు అయ్యింది. 2017లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, ఆ పార్టీ బలోపేతానికి కృషి చేయడం ప్రారంభించారు. ఆయన పనితీరును గుర్తించిన పార్టీ అధిష్టానం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది.

2019 లోక్‌సభ ఎన్నికలు రేవంత్ రెడ్డికి జాతీయ రాజకీయాల్లో అడుగు పెట్టే అవకాశం కల్పించాయి. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించారు. దేశంలోనే అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒకటైన మల్కాజిగిరి నుంచి గెలవడం ఆయన రాజకీయ జీవితంలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. పార్లమెంటులో కూడా తెలంగాణ సమస్యలపై ఆయన చురుకుగా స్పందించారు. రాష్ట్ర అభివృద్ధి అంశాలను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ బలహీనంగా ఉన్న దశలో పార్టీ అధిష్టానం రేవంత్ రెడ్డిపై నమ్మకం ఉంచింది. ఆయనను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. ఇది ఆయన రాజకీయ జీవితంలో ఒక కీలక దశ అనడంలో సందేహం లేదు. రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ఆయన కాంగ్రెస్ పార్టీని మళ్లీ ప్రజల్లో బలంగా నిలబెట్టేందుకు ప్రయత్నించారు. గ్రామాలు, పట్టణాలు తిరుగుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఆయన చేసిన పోరాటం చివరకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాన్ని ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గం నుంచి మళ్లీ గెలిచారు. దీంతో 2023 డిసెంబర్ 7న ఆయన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన రాజకీయ ప్రయాణం రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం నిజంగా అరుదైన విషయం. ఈ ప్రయాణం తెలంగాణ రాజకీయాల్లో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది.

ప్రజాశ్వీరాదంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని పది లక్షలకు పెంచడం, రైతులకు భారీ రుణమాఫీ వంటి నిర్ణయాలు కీలక తీసుకుంది. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించడం కూడా ప్రభుత్వానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. లక్షలాది మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రభుత్వంపై ప్రజల ఆసక్తిని చూపించింది.



-అమరవాజీ నాగరాజు
టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ

### హార్వర్డ్ వేదికపై తెలంగాణ

కొండారెడ్డిపల్లి గ్రామంలో ప్రారంభమైన రేవంత్ రెడ్డి ప్రయాణం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ విశ్వవిద్యాలయం వేదిక వరకు చేరుకోవడం నిజంగా విశేషం. ఆ వేదికపై తెలంగాణ అభివృద్ధి అవకాశాలు, పెట్టుబడులు, యువత పాత్ర గురించి రేవంత్ రెడ్డి వివరించారు.2026 జనవరి 25 నుంచి 30 వరకు హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో ‘లీడర్షిప్ ఇన్ 21వ సెంచరీ: క్యాసెస్, కాన్ఫ్లిక్ట్, కరేజ’ కోర్సు పూర్తి చేసి సర్టిఫికెట్ పొందారు. అక్కడ 20 దేశాల నుంచి వచ్చిన నాయకులను కలుసుకొని అసైన్మెంట్లు, గ్రూప్ ప్రాజెక్టులు రూపొందించడమే కాకుండా తెలంగాణ రైజింగ్ 2047 విజన్, పర్యావరణ ఆధారిత పారిశ్రామికాభివృద్ధి, మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి వివరించారు. భారతీయ విద్యార్థులను తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారమని పిలుపునిచ్చి, వైస్ ప్రొవోస్ట్, డీన్‌లతో విద్యా సహకారాలపై చర్చించారు. ఆయనకు అరుదైన ఏఐ పాలసీ సింపోజియంకు ఆహ్వానం అందింది. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఒక నాయకుడు అంతర్జాతీయ వేదికపై రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడటం అనేక మందికి గర్వకారణంగా మారింది.

రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం యువతకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుంది. మనం ఎన్నో పెద్ద పెద్ద కలలు కంటాం. వాటిని సాధించేందుకు మనలో గొప్ప పట్టుదల ఉండాలి. ఓటములు ఎదురైనప్పుడు భయంతో వెనుకడుగు వేయకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడమే విజయ రహస్యం. పదవి కోసం కాదు, పోరాటం కోసం రాజకీయాల్లోకి వచ్చిన నాయకుడిగా ఆయన తన ప్రయాణాన్ని నిర్మించుకున్నారు. కొండారెడ్డిపల్లి నుంచి హార్వర్డ్ వరకు సాగిన ఈ ఆయన బృహత్ ప్రయాణం ఒక విషయం స్పష్టంగా చెబుతోంది. కలలు చిన్నవైనా సరే, పట్టుదల పెద్దదైతే గెలుపు సాధ్యమవుతుంది.

# బాలవేలుగు పాఠశాలలో అన్నదానం..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాంతంలోని ముత్యాలనగర్ పంచాయతీ సిటైప్ కాలనీ పరిధిలో ఉన్న బాలవేలుగు పాఠశాలలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏరియాలోని పీకేఓసి-2 గని కార్మికుడు తోట కిరణ్ కుమార్ తన మేనకోడలు జీ మహితా శ్రీ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తోట కిరణ్ కుమార్, ఆయన సతీమణి నాగ సునీతలు చిన్నారులకు స్వయంగా ఆహార పదార్థాలను వడ్డించి సహపంక్తి భోజనాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి సంతోషంగా భోజనం చేసి, వారికి ఆశీస్సులు అందజేశారు.కార్యక్రమంలో నితీష్, తోటి కార్మికులు నాగరాజు, హరి, శివ, దిలీప్, పాఠశాల నిర్వాహకులు జగన్మోహన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు అభినందించారు.

# రాములోరి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం



**చర్ల ,మహా:** మండల పరిధిలోని లింగాపురంపాడు గ్రామంలో శ్రీ కోదండ రాములవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.లింగాపురంపాడు గ్రామానికి వెళ్లి శ్రీ కోదండ రాములవారి విగ్రహ ప్రతిష్ట* కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పొందేం ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వచనం స్వీకరించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్ భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు బండారు రామకృష్ణ, జవ్వాది రవి, చీమకుర్తి భద్రం, సర్పంచ్‌లు పూజారి సామ్రాజ్యం, గుగులోత్ మంగ, కాపుల కృష్ణ, ఏఎంసి చైర్మన్ ఇర్ప శ్రీనివాస్, మెడిచర్ల కుమార్, శివ, నాయుడు, వరప్రసాద్, రాయుడు, గుండేపూడి భాస్కర్ రావు, పెద్ది రెడ్డి, పండు, రవికాంత్, నరేష్, భద్రాచలం సీనియర్ నాయకులు తమ్మల్ల వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి సంభశివరావు, కొల్లాపూడి వరుణ్, చిట్టిబాబు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పినపాక నియోజకవర్గంలో.. ప్రారంభమైన పది పరీక్షలు ప్రారంభం..

## 17 కేంద్రాల్లో 2,640 మంది విద్యార్థులు హాజరు..



**మణుగూరు, మహా :** పినపాక నియోజకవర్గం లో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ పరిధిలో మండలాల్లో మొత్తం 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 2,640 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.మండలాల వారీగా బూర్గంపాడు మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 640 మంది, అశ్వాపురం మండలంలో రెండు పరీక్ష కేంద్రాల్లో 199 మంది, మణుగూరు మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో 921 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. అలాగే పినపాక మండలంలో రెండు కేంద్రాల్లో 358 మంది, కరకగూడెం మండలంలో ఒక కేంద్రంలో 120 మంది, ఆళ్లపల్లి మండలంలో ఒక కేంద్రంలో 124 మంది, గుండాల మండలంలో రెండు కేంద్రాల్లో 270 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చర్యలు చేపట్టామని అధికారులు పేర్కొన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రతిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

# శ్రీ సీతారాముల కల్యాణానికి డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్యకు ఆహ్వానం..



**మణుగూరు /అశ్వాపురం, మహా :** భక్తి, భవ్యతలకు ప్రతీకగా నిలిచే భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే పవిత్ర సీతారామ కల్యాణ మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్యకు ఆలయ అధికారులు ఆహ్వానం అందజేశారు. శనివారం ఆలయ ఈవో దామోదర్, ఆలయ అర్చకులు కలిసి బ్రహ్మయ్యను మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రిక అందించారు. శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవానికి కుటుంబ సమేతంగా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు విజ్ఞప్తి చేశారు.భద్రాద్రి క్షేత్రంలో జరిగే సీతారాముల కల్యాణం దేశవ్యాప్తంగా అపారమైన భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించబడే మహోత్సవంగా ప్రసిద్ధి చెందింది. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు ఈ దివ్య వేడుకను దర్శించేందుకు తరలి వస్తారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ, భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీ సీతారాముల దివ్య కల్యాణనికి ఆహ్వానం తనకు అందడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. స్వామివారి కృపతో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.

# ఎస్ఆర్డిజి స్కూల్లో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ధర్నా







**రాజేంద్రనగర్ మహా ;** రెండవ శనివారం రోజు ప్రభుత్వం హాలిడేగా ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలలన్నీ సెలవు దినంగా భావించి స్కూళ్లు మూసివేశారు. కాని అందుకు భిన్నంగా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎస్ఆర్ డీజీ స్కూల్ యజమాన్యం ప్రభుత్వ హాలిడే రోజు స్కూల్ నడుపుతు ప్రభుత్వం యొక్క ఆదేశాలను పట్టించుకోకుండా స్కూల్లో అడ్మిషన్స్ కొనసాగిస్తున్నారు.చూసి చూడనట్టు వదిలేస్తున్న మండల విద్యాధికారులు.ప్రభుత్వం విద్యాలయాలకు సెలవు ప్రకటించిన కొందరు ప్రైవేటు స్కూల్స్ యజమాన్యం సెలవు దినాన్ని కూడా పని దినంగా మార్చుకొని కొత్త అడ్మిషన్లు చేర్చుకుంటున్నారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కే వై ప్రణయ్ మాట్లాడుతూ సెలవు దినంలో కూడా స్కూల్ నడుపుతున్న ఎస్ ఆర్ డి జి యాజమాన్యం, విద్యార్థుల ఫీజులు వసూలు చేయడానికి స్కూల్ పెట్టి తల్లిదండ్రుల దగ్గర ఫీజు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. సెలవు దినంలో కూడా స్కూల్ పెట్టినందుకు విద్యార్థులు డిప్రెషన్ కి గురై ఎస్ఎఫ్ఐ నాయకులకు ఫోన్ చేసి ఏడుస్తున్నారు,శంషాబాద్ లో అన్ని పాఠశాలలో సెలవు ప్రకటించగా ఎస్ ఆర్ డి జి యాజమాన్యం మాత్రం విద్యార్థులను పాఠశాలకు రావాలని ఒత్తిడి చేస్తున్నారు. 20252026 పూర్తి అవ్వకముందే 20262027 నూతన అడ్మిషన్లు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. దీనిపై విద్యఅధికారులు వెంటనే స్పందించి ఎస్ ఆర్ డి జి స్కూల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, తరుణ్, హర్ష, సతీష్, కౌశిక్, సాయి, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అభివృద్ధి దిశగా ముందుకు పోవాలి

- కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ
- హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలి
- దిశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బివి రాజు
- మహిళా చైతన్యమే సామాజిక మార్పుకు నాంది
- భరోసా ఎస్సై చల్లా అరుణ
- మహిళలు తమ హక్కుల కోసం తెలుసుకోవాలి
- పాల్వంచ 37వ డివిజన్ కార్పొరేటర్ మల్లెల స్వప్న కుమారి
- దిశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





**భద్రాద్రి బ్యూరో, మహా:** మహిళలు అన్ని రంగాల్లో ఉండాలని కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ అన్నారు. భద్రాద్రి జిల్లా కేంద్రంలోని శనివారం దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఎస్పి ఆదినారాయణ మాట్లాడుతూ మహిళా సాధికారికతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.

**ప్రభుత్వ శాఖలలో మహిళ అధికారులు**

సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. అంతేకాకుండా ఎన్నికల్లో కూడా మహిళలు పోటీ చేసి గెలిచి వారంతా ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయం అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా సైతం ఎదుగుతున్నారని ఇది అభివృద్ధికి నాంది అని అన్నారు.

**హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలి..**

మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని దిశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బివి రాజు అన్నారు. దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఏర్పడిన నాటి నుండి ఇప్పటివరకు మహిళల సంక్షేమం కోసం ఎంతో కృషి చేయడం జరిగిందన్నారు. ఇబ్బందుల్లో ఉన్న మహిళా మహిళా జంటలను ఏకం చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం మహిళలు అని రంగాల్లో రాణించడం అభినందనీయం అన్నారు. పురుషులతో పాటు సమానంగా విధులు నిర్వర్తిస్తూ మహిళా అధికారులు సిబ్బంది సమర్థవంతంగా తమ వంతు పాత్రను పోషిస్తున్నారని తెలిపారు. కుటుంబ బాధ్యతలతో పాటు విధి నిర్వహణలో కూడా పలు శాఖల్లో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న మహిళామణులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేసారు.

**మహిళా చైతన్యమే సామాజిక మార్పుకు నాంది...**

మహిళ చైతన్యమే సామాజిక మార్పుకు నాంది అని భరోసా ఎస్సై చల్లా అరుణ అన్నారు. హక్కుల పరిరక్షణ కోసం మహిళలు ఐఖ్యంగా పోరాడాలన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఆర్థిక స్వావలంబనతోనే సాధికారత అని పేర్కొన్నారు.

**మహిళలు తమ హక్కుల కోసం తెలుసుకోవాలి...**

మహిళలు తమ హక్కుల కోసం తెలుసుకోవడంతో పాటు చట్టాలపై సైతం అవగాహన ఉండాలని పాల్వంచ కార్పొరేషన్ 37వ డివిజన్ కార్పొరేటర్ మల్లెల స్వప్నకుమారి అన్నారు. మహిళల కోసం రూపొందించిన రక్షణ చట్టాలు, హక్కులు పరిరక్షించబడాలంటే ఐఖ్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలన్నారు. మహిళా ఉద్యోగులు ఎందులోనూ తక్కువ కాదనే విధంగా ఉండాలని, అత్యంత సమర్ధవంతంగా చాకచక్యంగా విధులు నిర్వహించాలన్నారు. ఇటు ఉద్యోగా బాధ్యతలు, అటు ఇంటి బాధ్యతలను శక్తి వంచనే లేకుండా సమర్ధవంతంగా ముందుకు తీసుకెళుతున్న మహిళలు నిజంగా బలవంతులని చెప్పారు. సింగరేణిలో సైతం మహిళా సాదికారత వాతావరణం ఉంటుందని, సంస్థ ఉన్నతిలో మహిళా పాత్ర ఉన్నతమైనదిగా ఉండేలా నడుచుకోవాలని హితవు పలికారు. సింగరేణి యాజమాన్యం మహిళా సౌకర్యాల కోసం క్రేచ్ రూమ్ ఏర్పాటు చేయాలని, ప్రత్యేక డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా మల్లెల స్వప్నకుమారి సూచించారు.

**మహిళలు ఆర్థికంగా ఎదగాలి...**

ఆడపడుచులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు పూజాల లక్ష్మి అన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. ప్రధానంగా మహిళలు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సెక్రెటరీ బొల్లం అరుణ, జనరల్ సెక్రెటరీ పిట్టల కమల, 13 డివిజన్ శాంత, 10వ డివిజన్ వీరమ్మ, 1వ డివిజన్ సుగుణ రెడ్డి, 11వ డివిజన్ ఆకాంక్ష, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతామాలక్ష్మి, ఫైనాన్షియల్ అడ్వైజర్ అంజాద్, ఎస్ కే టి పిచ్చేశ్వరరావు, సంస్కృతి విద్యాలయ ప్రధాన అధ్యాపకురాలు శిరీష ఫణి కుమార్, దిశా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- నల్గొండ సెట్విన్ లో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ..
- మహిళా సంఘాలకు పాఠశాల యూనిఫాంల తయారీ బాధ్యత..



**నల్గొండ, మహా :** మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని సెట్విన్ (SETWIN) సంస్థలో శిక్షణ పూర్తి చేసుకున్న 116 మంది మహిళలకు ఆయన కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**ఖాళీగా ఉండొద్దు స్వయం ఉపాధి పొందండి..**

మహిళలు ఇంట్లోనే పరిమితం కాకుండా పట్టుదలతో ఏదో ఒక పనిలో నైపుణ్యాన్ని నేర్చుకోవాలని మంత్రి సూచించారు. నల్గొండ సెట్విన్ సంస్థను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ఇప్పటి వరకు ఇక్కడ 27 కోర్సుల్లో 1250 మందికి శిక్షణ ఇచ్చాం. శిక్షణ పొందిన వారు మహిళా సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వం నుంచి రుణాలు ఇప్పిస్తాం. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫాంలను కుట్టే బాధ్యతను కూడా ఈ సంఘాలకే అప్పగిస్తాం అని వెల్లడించారు. జిల్లాలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, నూతన కలెక్టరేట్ నిర్మాణాలు జరుగుతున్నాయని ఇవి పూర్తయితే ఎలక్ట్రిషియన్, ప్లంబింగ్ వంటి కోర్సులు చేసిన వారికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. కంప్యూటర్ శిక్షణ పొందిన మహిళలను ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్లుగా నియమిస్తామన్నారు.

**రెండు దశల్లో మూసీ ప్రక్షాళన..**

అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. మూసీ నది కాలుష్యం వల్ల జిల్లాలోని 30 లక్షల మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే మూసీ ప్రక్షాళన పనులు చేపడతామని మొదటి దశలో 21 కి.మీ, రెండో దశలో మరో 21 కి.మీ మేర పనులకు టెండర్లు పిలుస్తామని చెప్పారు. ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. డిండి ప్రాజెక్టు పనులను కూడా వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఆయన గుర్తు చేశారు.

**ఏడాదికి 25వేల మందికి శిక్షణ.. సెట్విన్ చైర్మన్**

సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. నైపుణ్యాభివృద్ధిని జిల్లాలకు విస్తరించామని, ఏటా 25 వేల మందికి శిక్షణ ఇవ్వడమే తమ లక్ష్యమని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మహిళలు బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. ఈవీ వాహనాలు, ఆటో ట్రాలీ రంగాల్లో భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి కళ్యాణ లక్ష్మి చెక్కులను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య, సెట్విన్ ఎం.డి ఉపేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆఫీస్ ఖాన్, సెట్విన్ ప్రిన్సిపాల్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బొడ్రాయి ప్రతిష్టాపన...



**రాజేంద్రనగర్, మహా :** మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని మైలార్దేవ్‌పల్లి గ్రామంలో బొడ్రాయి (నాబాశీల) ప్రతిష్టాపన మహోత్సవం బిజెపి నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి స్థానిక నాయకులు, కమిటీ సభ్యులతో కలిసి శనివారం పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రామ పండుగ కార్యక్రమంలో పాలుపంచుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నా.గ్రామంలో కుటుంబసభ్యులు లాగా పాల్గొంటూ అంగరంగ వైభవంగా నిర్వహించిన (నాభిశీల) బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి చల్లగా చూడాలన్నారు.కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు ఎ కృష్ణ యాదవ్, రావుల భాస్కర్, కాశమౌని అనిల్ ముదిరాజ్, శశిధర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, బాల్ రెడ్డి, దేవులపల్లి దాసు, నర్సింగ్, నరేందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కోవాకుల బాబు బొమ్మరాజు, నరసింహ, మధుసూదన్ రెడ్డి, శంకర్ రెడ్డి, దేవేందర్ గౌడ్, ధర్మేందర్ గౌడ్, శ్యామ్ యాదవ్, సురేష్ ముదిరాజ్ ,రమేష్ ముదిరాజ్, వెంకటేష్ ,నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దశల వారిగా మున్సిపాలిటీ అభివృద్ధి: ఆచారి




**ఆమనగల్లు, మహా :** దశల వారిగా ప్రజాప్రతినిధులు తమ వార్డులను అభివృద్ధి పరిచి అన్నివిధాల ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేయాలని మాజీ జాతీయ ఓబిసి కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. శనివారం ఆమనగల్లు మున్సిపాలిటీలోని 7వ వార్డు అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను జాతీయ ఓబిసి మాజీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి,మున్సిపల్ చైర్మెన్ పత్య నాయక్ ,వైస్ చైర్మెన్ తల్లోజు గీత, కౌన్సిలర్ నిరంజన్ నాయక్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశల వారిగా వార్డులో మౌళిక సదుపాయాలను కల్పించి వార్డును అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేలా దృష్టి సారించాలని,కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతో మున్సిపల్ పాలకవర్గం మున్సిపాలిటిని అన్నిరంగాలలో అభివృద్ధి చేయాలని సూచించారు.చైర్మన్ పత్య నాయక్ మాట్లాడుతూ వార్డులో ఉన్న సమస్యలను పరిష్కారానికి ప్రాధాన్యమివ్వడం జరుగుతుందని,ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విద్యుత్, తాగునీరు, సీసీ రోడ్లు, మురుగు కాలువలు తదితర సమస్యలను దశల వారిగా పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.డ్రైనేజీ సమస్య ఉన్న ప్రతీ వార్డుకు నిధులు కేటాయించి కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు.

# భానుడి భగభగలు

## మండుతున్న ఎండలు

- ఉదయం నుంచే భానుడి ప్రతాపం
- పెరిగిన ఉష్ణోగ్రతలు
- బెంబేలెత్తుతున్న జనం
- మరింత పెరుగుతాయంటున్న వాతావరణ శాఖ
- పేదోడి ఫ్రిడ్జ్ కుండలకు డిమాండ్
- శీతల పానీయాలతో యువతకు ఉపాధి





**ఆమనగల్లు, మహా :** భానుడు నిప్పులు కక్కుతున్నాడు. ఓ వైపు భగభగలు.. మరో వైపు వడగాల్పులతో జనం బెంబేలెత్తిపో తున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే వేడి తీవ్రత కనిపిస్తోంది. బయటికెళ్తే నెత్తిపైన కుంపటి పెట్టినట్లే మండిపోతున్నది. ఇక రాత్రుళ్లు ఉక్కబోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెండు మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి.ఇల్లు దాటి బయటకు రావాలంటే జంకుతున్నారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల సమయంలో ప్రయాణాలు రద్దు చేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు పట్టపగలే చుక్కలు చూడటం అంటే ఇదేనేమో. మండుతున్న ఎండలకు జనం చుక్కలు చూస్తున్నారు. బయటికి రావలంటేనే జనం జంకుతున్నారు. ఉదయం సూర్యోదయం నుంచే సూర్యుడు విశ్వరూపం ప్రదర్శిస్తుండటంతో వేడిమికి తాళలేక ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఎప్రిల్ నెలలోనే ఇలా ఉంటే.. ముందు ముందు ఎండలు ఎలా ఉండయోబోతున్నాయని భయపడుతున్నారు. ముదిరిన ఎండల మూలంగా శీతల పానీయాల కేంద్రాల కొనుగోలుదారులతో కళకళ లాడుతున్నాయి. కూలర్లు, ఏసీ మరమ్మతులు బిజీబిజీగా మారాయి.

**జాగ్రత సుమీ..**

ఎండలు ముదురుతుండడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతు న్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా బయట తిరిగే ఉద్యోగులు, మార్కెటింగ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్లు అప్రమత్తంగా లేకపోతే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రజలు ఎండ నుంచి రక్షణతోపాటు రోగ నిరోధక శక్తి తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎండలో ఎక్కువగా తిరగడం.. పనిచేయడంద్వారా శరీరంలో ఉన్న లవణాల శాతం తగ్గిపోతుందని, నీరసంగా, బలహీనంగా మారుతారని అంటున్నారు.

**ఉపాధి పొందుతున్న యువత...**

వేసవి కాలం ప్రారంభంలో ఎండలు తీవ్రత పెరగడం వలన సీజనల్ వ్యాపారాలు ఊపందుకున్నాయి. ప్రతి యేటా నిరుద్యోగులు ఉపాధి కోసం చిరు వ్యాపారులైన కొబ్బరి బొండాలు, జ్యుస్, లస్సీ, చెరుకు విక్రయాలు, శీతల పానీ యాల విక్రయాల ద్వారా ఉపా ధి పొందుతున్నారు. తోపుడు. బండ్లు, ఫుట్పాత్లపై, చిన్న చిన్న కోట్లను ఏర్పాటు చేసు కుని విక్రయాలు సాగిస్తున్నారు.

**పెరిగిన ఉష్ణోగ్రతలు..**

రెండు రోజుల నుంచి ఉష్ణోగ్ర రోజుకు పెరిగిపోతున్నాయి.జనులు ఇండ్లు దాటి బయటకు రావడంలేదు.రాష్ట్రంలో ఉత్తర దిశ నుంచి అతి తక్కువ ఎత్తులో వేడి గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంటుంది. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల సమయంలో బయటి ప్రయాణా లేవీ చెయొద్దని సూచిస్తున్నారు.

**సామాన్యుని దృష్టి కూలర్ల వైపే..**

రోజు రోజుకు ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడి అధికంగా ఉంటుండగా.. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపటం లేదు. ఇళ్లల్లోని ఫ్యాన్ గాలి సైతం వేడిగా వస్తున్న క్రమంలో అందరి దృష్టి కూలర్ల వైపు పడింది. ఎండ వేడిమి నుంచి రక్షణ పొందేందుకు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్న పరిస్థితులుండగా.. ఇంట్లో నైనా కూల్ కూల్ గా ఉండాలని భావిస్తున్నారు. ఏసీల కొనుగోలుపై అయిష్టత ఉన్న వారు కూలర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో సమ్మర్ లో ఇంట్లో ఉన్నంత సేపయినా చల్లగా ఉండేందుకు ఇష్టపడుతున్నారు.

**ఆకట్టుకునేలా డిజైన్లు**

చాలా మంది దుకాణదారులు వినియోగదారులను ఆకట్టుకునేందుకు దుకాణం ఎదుట రకరకాల కూలర్లను అందుబాటులో ఉంచుతున్నారు. గతంలో గడ్డితో తయారు చేసిన కూలర్స్ ఉండగా.. తాజాగా కూలింగ్ ప్యాడ్స్ కలిగిన కూలర్లు, బ్లోయర్ తో కూడిన కూలర్ తదితర రకాలు లభిస్తున్నాయి. ఇవి సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటున్న క్రమంలో అధికంగా కూలర్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.. వేసవి కాలంలో ఇంట్లో ఉన్న ఫ్యాన్ గాలి వేడిగా ఉంటున్న క్రమంలో అధికంగా కూలర్లను కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింతగా ఉండే అవకాశం ఉండడంతో పాటు వడగాల్పులు వీస్తుంటాయి. ఈ క్రమంలో వాటి నుంచి రక్షణ పొందేందుకు కూలర్లను కొనడానికి మొగ్గు చూపుతున్నారు. కూలర్ల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయనే చెప్పుకోవచ్చు. ప్రారంభ ధర రూ.3 వేల నుంచి రూ.26 వేల వరకు ఉన్నాయి. ఇందులో లీటర్లు, కంపెనీల బట్టి ధరలుండగా.. అందుబాటులో సామాన్యులు రూ.3వేల నుంచి రూ.10వేల వరకు కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. వీటిలో లీటర్ల కెపాసిటీ అధికంగా ఉంటే మరింత చల్లదనంగా ఉంటాయనే భావనలో వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు.

**వేసవి తాపంతో పెరిగిన విక్రయాలు**

ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో కుండలకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది. కుండలు, కూజాల కొనుగోళ్లకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. గ్రామాల్లో కుండలు తయారుచేసి తెచ్చి మార్కెట్లో అమ్ముతున్నారు. కుండ నీరు ఆరోగ్యానికి శ్రేయస్కరం. ఎంత ఎండున్నా కుండ ల్లో నీరు చల్లగా అవుతుంది. సైజును బట్టి రూ.100 నుంచి రూ., 600 వరకు కుండలు, కూజాలు విక్రయిస్తున్నారు. పేదోడి ఫ్రీడ్జానూ కుండలకు పేరు. జూన్ వరకు వీటి విక్రయాలు జోరుగా సాగుతాయి.

## ఉచిత ఆరోగ్య మేళా కాస్తా...

# సన్మాన సభగా మారింది...

### ప్రతి పేదవాడికి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందాలి.. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్...

**రాజేంద్రనగర్ మహా ;** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ఉచిత ఆరోగ్య శిబిరం కాస్త కాసేపు సన్మాన సభగా మారింది. శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీలో) లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య మేళాను సర్పంచ్ దేవులపల్లి సునీత సత్యనారాయణ గౌడ్, జిల్లా వైద్యాధికారి లలితా దేవితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శనివారం ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన స్పెషలిస్ట్ డాక్టర్లు, జనరల్ ఫిజీషియన్ డాక్టర్స్, డెంటల్ సంబంధించిన నిపుణులు, కంటికి సంబంధించిన నిపుణులు, చిన్నపిల్లల నిపుణులు, వ్యాధి నిరోధిక టీకాల నిపుణులతో పరీక్షలు చేయించి నాణ్యమైన వైద్యం అందిస్తూ కావలసిన మందులు అందజేస్తారని చుట్టూ ముట్టూ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు శిబిరానికి హాజరయ్యారు.ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం చేరువ చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రజా పాలనలో భాగంగా గ్రామ స్థాయిలో ఇలాంటి ఆరోగ్య మేళాలు నిర్వహించడం వల్ల సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.ఈ మేళాలో బిపి, షుగర్ వంటి సాధారణ పరీక్షలతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని, అనారోగ్య సమస్యలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులను, సిబ్బందిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.ప్రారంభించిన నిమిషం నుంచి సుమారు గంట వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముందే వేసవికాలం మండుటెండల్లోశంషాబాద్ మండలంలోని ఇతర గ్రామాల నుండి పెద్ద ఎత్తున గ్రామస్తులు, వృద్ధులు, చంటి పిల్లలను, తల్లులు సంకలో వేసుకుని గంటల తరబడి క్యూ లైన్ లో వేచి ఉన్నారు. సన్మాన కార్యక్రమంఅయిపోయేంతవరకు డ్యూటీలో ఉన్న డాక్టర్లు సెల్ ఫోన్లతో కాలక్షేపం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధుల మండల అధికారులు, వైద్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ!

**ఆమనగల్లు, మహా :**మాడ్గుల మండలం గిరికొత్తపల్లి గ్రామపంచాయతీలో శనివారం పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ భాగ్యమ్మ, ఉపసర్పంచ్ మహ్మద్ ఖదీర్ శానిటైజర్ కిట్లను పంపిణీ చేశారు.అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. గ్రామాన్నిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతమైన వాతావరణంలో

# పదవ తరగతి పరీక్షలు..!

- గచ్చిబౌలిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- పరీక్షల సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి
- పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కావలసిన వసతుల ఏర్పాటు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా సాగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ సి నారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మొదటిరోజు గచ్చిబౌలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్నీ జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరీక్షల సరళిని పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు ప్రథమ చికిత్స మందులు, ఓ.ఆర్ఎస్ ప్యాకెట్లు, తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు తగిన సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల్లో వసతులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని సూచించారు.

## సింగరేణిలో రాజకీయ జోక్యం తగ్గాలి

### సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి డిమాండ్



**మందమర్రి, మహా :**సింగరేణి కాలరీస్ కంపెనీలో రాజకీయ జోక్యం తగ్గాలని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కే.కే5 గని ఆవరణలో సేవ్ సింగరేణి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం తగ్గించాలని అన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన 50 వేల కోట్లు రూపాయలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డును పాత పద్ధతిలో నిర్వహించాలి కోరారు. సొంతింటి కల సహకారం కావాలని స్పష్టం చేశారు.పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ యాజమాన్యమే చెల్లించాలని చెప్పారు. చాలా రోజులుగా పెండింగ్ లో ఉన్న కార్మికుల మారుపేర్లను సరిచేయాలని పేర్కొన్నారు. తదితర పెండింగ్ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో వచ్చే నెలలో సింగరేణి కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈనెల 17 న సింగరేణి వ్యాప్తంగా అన్ని గనుల డిపార్ట్మెంట్లపై నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

**ఈనెల 18 నుండి 30 వరకు బస్సు జాత**

మార్చి 18 నుండి 30 వరకు సేవ్ సింగరేణి బస్సు జాతను సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నిర్వహిస్తుందని నాయకులు వెల్లడించారు. ఈ జాత గోలేటి నుండి కొత్తగూడెం వరకు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం సింగరేణిలో జరుగుతున్న వాస్తవ విషయాలను కార్మికులకు తెలియపరుస్తూ చైతన్య పరిచేందుకు ఈ జాత నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మందమర్రి ఏఐటీయూసీ బ్రాంచి అసిస్టెంట్ కార్యదర్శి సోమిశెట్టి రాజేశం, బ్రాంచి జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, కే.కే5 గని పిట్ సెక్రటరీ గాండ్ల సంపత్ కుమార్,వైస్ ప్రెసిడెంట్ గోవిందుల రమేష్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు విక్రమ్ సింగ్, వరప్రసాద్,సిద్ధాంత్,పిట్ కమిటీ సభ్యులు గాజ హేమ చందర్, సాంబ శ్రీకాంత్,కార్మిక సోదరులు తదితరులు పాల్గొన్నారు..

## ముస్లిం సోదరులకు రంజాన్ సందర్భంగా కానుకలు

### మంచిర్యాలజిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి ,మహా:** రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం బాబు క్యాంపు జామా మసీదులో జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు,తోఫా పంపిణీ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డంవినోద్,జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, బెల్లంపల్లి మండల తహసిల్దార్ శ్రీనివాస్, బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్, చైర్ పర్సన్ స్వాతి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు



తోఫా అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గానికి 3 లక్షల రూపాయలు కేటాయించి 750 తోఫా కిట్లను అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఈద్ కా తోఫా కార్యక్రమంలో భాగంగా ముస్లింసోదరులకు కానుకలుఅందజేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మున్సిపల్ కమిషనర్ సంపత్, తహసీల్దార్ ఎల్ కృష్ణ తోపాటు సంబంధితశాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## కాసిపేట 1 ఇంక్లైన్ గని సందర్శించిన అసిఫాబాద్ డిఎఫ్ఓ

- ఘనంగా సన్మానించిన గనిమేనేజర్
- ఎఐటియుసి, ఐఎన్టీయూసీ యూనియన్లు

**బెల్లంపల్లి, మహా:**కాసిపేట 1 ఇంక్లైన్ గని శనివారం ఉదయం కుటుంబసమేతంగా అసిఫాబాద్ డి ఎఫ్ ఓ. నీరజ్ తిబ్రేవాల్ (ఐఎఫ్ఎస్) సందర్శించారు. నీరజ్ తిబ్రేవాల్ ని కాసిపేట గని మేనేజర్ సతీష్,ఎఐటియుసి పిట్ సెక్రెటరీ మీనుగు లక్ష్మినారాయణ, ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మన్ దాస్ లు శాలువా,బొకేతో సన్మానించి,మైసమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించినా అనంతరం వారిని గని పని స్థలాలకు తీసుకువెళ్లడం జరిగింది.



పని చేస్తున్న కార్మికులను ఉద్దేశించి కష్టతరమైన పనులను చాకచక్యంగా నిర్వహిస్తున్న ఉద్యోగులు చాలా గొప్పవారని అన్నారు.ఉద్యోగులు, అధికారుల ఆతిధ్యం మరుపురానిదని అన్నారు.గనిలో బొగ్గు ఉత్పత్తి జరుగుతున్న విధానం,మిషనరీ పనితీరు,గని ఆవరణలో మొక్కల పెంపకం,మామిడితోటలు,పార్కు లను చూసి సంతోషం వ్యక్తం చేశారు.

## వాణిజ్య సముదాయాలో పారిశుద్ధ క్లీన్ డ్రైవ్..


### హైదరాబాద్ కమిషనర్ ఆర్ వి కర్ణన్..

**రాజేంద్రనగర్, మహా ;** జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్న జల్‌పల్లి సర్కిల్ లో, శంషాబాద్ జోన్‌లో ఆకస్మికంగా శనివారం సందర్శించారు. పలు వాణిజ్యసముదాయాల్లో పరిశుద్ధ క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ని క్లీన్ అండ్ గ్రీన్ గా మార్చాలి అన్నారు. ఈ క్లీన్ డ్రైవ్ లో జోనల్ కమిషనర్ చంద్రకళ, డిసి జల్‌పల్లి, డిప్యూటీ ఇఇ, ఎస్డబ్ల్యుఎం & ఇతర ఫీల్డ్ సిబ్బందితో కలిసి పారిశుధ్య క్లీన్‌లీనెస్ డ్రైవ్ & వాణిజ్య ప్రాంతాలను పరిశీలించారు.




## ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి 11వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జోన్ పరిధిలోని కుమ్మరి బస్తీ లో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మినరసింహస్వామి కల్యాణోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, రాజ్ కుమార్ తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల కోసం అన్నదాన వితరణ నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులు ప్రతి ఒక్కరుపై ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ



చైర్మన్ సుష్మా రెడ్డి, మాజీ జెడ్పిటిసి నిరటి తన్విరాజ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో సరిపడా నిల్వలు..

# గ్యాస్ సిలిండర్ల కొరతలేదు..!

- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి
- ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దు..
- సిలిండర్లను బ్లాక్ లో విక్రయిస్తే కఠిన చర్యలు..
- యధావిధిగా గ్యాస్ సరఫరా జరుగుతుంది
- హాస్టల్స్ ఆస్పత్రులలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం..
- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు
- అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా అదనపు కలెక్టర్




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**జిల్లాలో గ్యాస్ సరఫరా పై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, యధావిధిగా ఎప్పటిలాగానే గ్యాస్ సరఫరా జరుగుతుందని, రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి స్పష్టం చేశారు. శనివారం సరూర్ నగర్ తహసీల్దార్ కార్యాలయంలో జిల్లాలో గ్యాస్ సరఫరాపై పోలీసు సివిల్ సప్లై, రవాణా, విద్య ఆరోగ్య శాఖతో పాటు ఇతర శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను అధికారులతో అడిగి తెలుసుకొని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్లకు సంబంధించి ఎలాంటి కొరత లేదని ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి అన్నారు. గ్యాస్ సిలిండర్లకు సంబంధించి జిల్లాలో ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ళు గురుకులాలు పాఠశాలల్లో గ్యాస్ సరఫరా లో సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి హాస్టలు పాఠశాల గురుకులాలను సందర్శించి పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో హాస్పిటల్లో అవసరమయ్యే గ్యాస్ కు సంబంధించి వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ జరపాలన్నారు. ఆస్పత్రుల్లో గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వైద్య శాఖ అధికారులు ప్రత్యేకంగా మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎవరైనా గ్యాస్ సిలిండర్ల ను కృత్రిమ కొరత సృష్టిస్తూ బ్లాక్ మార్కెట్ కు తరలిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. పోలీసులు రవాణా శాఖ అధికారులు ఈ అంశంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బ్లాక్లో విక్రయించకుండా పోలీస్ అధికారులు నిరంతరం నిఘా పెట్టాలని పేర్కొన్నారు.

రాష్ట్ర పౌరసరఫరాలు సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో గ్యాస్ సరఫరా పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ చైర్మన్ డిస్టిక్ సివిల్ సప్లై ఆఫీసర్ కన్వీనర్ గా 12 మంది అధికారులతో కలిసి డిస్టిక్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సూపరిండెంట్ ఆఫ్ పోలీస్, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ, డిస్టిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్, డీఈవో, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్, బీసీ డెవలప్మెంట్ ఆఫీసర్, ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎస్టీ డెవలప్మెంట్ ఆఫీసర్, అగ్రికల్చర్ ఆఫీసర్ డిస్టిక్, డిఎం అండ్ హెచ్ ఓ, సేల్స్ మేనేజర్ హెచ్పీసీఎల్ బిపిసిఎల్ ఎల్పిజి డీలర్స్ సభ్యులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.. ఎప్పటికప్పుడు మానిటరింగ్ కమిటీ గ్యాస్ సరఫరా ఇబ్బందులపై పర్యవేక్షణ జరుపుతుందన్నారు.

జిల్లా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ గా వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గ్యాస్ సరఫరా పై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. యధావిధిగా ఎప్పటిలాగానే గ్యాస్ సరఫరా జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం సరూర్నగర్ లోని ఐశ్వర్య గ్యాస్ ఏజెన్సీ మరియు వనస్థలిపురంలోని శ్రీనివాస్ గ్యాస్ ఏజెన్సీల గోదాములను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా గ్యాస్ సరఫరా చేయాలని ఏజెన్సీ వారికి సూచించారు. ఈ సమావేశంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్, జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత, జిల్లా వైద్యాధికారి లలితా దేవి, సంక్షేమ శాఖ అధికారులు రామరావు, రామేశ్వరీ దేవి, ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**డిస్టిక్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు...**

రంగారెడ్డి జిల్లాలో గ్యాస్ సరఫరా పై ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు డిస్టిక్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి ఆ యొక్క కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్, డిస్టిక్ సివిల్ సప్లై అధికారి కన్వీనర్ గా, 12 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. గ్యాస్ సిలిండర్లను ఎవరైనా బ్లాక్ లో విక్రయించినట్లయితే వారిపై, మానిటరింగ్ ఎనర్జీ కమిటీ కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎవరిని కూడా ఉపేక్షించలేదని స్పష్టం చేశారు

## నూతన సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని

# ప్రారంభించిన ఎమ్మెల్యే రంగారెడ్డి

- ప్రజా ప్రభుత్వంలో ప్రజల వద్దకే పరిపాలన
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు సులభంగా అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో, నూతన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను, ఎమ్మెల్యే రంగారెడ్డి ఏర్పాటు చేశామన్నారు. రంగారెడ్డి జిల్లా జిహెచ్ఎంసి పరిధి, ఆదిభట్ల సర్కిల్ మునగనూరులో నూతన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నూతన రిజిస్ట్రేషన్ కార్యాలయంతో మునగనూరు, తొర్రూరు, రాగన్నగూడ, తుర్కయంజాల్, మన్నెగూడ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం వనస్థలిపురం వెళ్లాల్సిన అవసరం ఇకపై ఉండదని తెలిపారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు సులభంగా అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో నూతన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంత ప్రాంత ప్రజలు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఈ కార్యాలయం ప్రారంభంతో సమయం మరియు ఖర్చు రెండూ తగ్గి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.



ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం మునగనూరుకు రాకుండ అడ్డుకునేందుకు కొందరు కుట్రలు చేసిన, పట్టుపట్టి మీకోసం మునగనూరుకు తీసుకోవచ్చామని ఎమ్మెల్యే తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, అవినీతి అనేది లేకుండా అధికారులు పని చేయాలనీ ఎమ్మెల్యే సూచించారు...ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, కార్యాలయం అధికారులు, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, ముత్యాల రాజశేఖర్ రావు, కోషికే ఐలయ్య, అమరేందర్ రెడ్డి, వంగేటి గోపాల్ రెడ్డి, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### అన్ని రంగాలలో మహిళలు రాణించడం

# ఆనందంగా ఉంది

- ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్ శ్రీవాణి రాధాకృష్ణ

**మందమర్రి, మహా :** అన్ని రంగాలలో మహిళలు రాణించడం ఆనందంగా ఉందని మందమర్రి ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్ శ్రీవాణి రాధాకృష్ణ అన్నారు. శనివారం ఏరియా ఇల్లందు క్లబ్ లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా మందమర్రి ఏరియా జీ.ఎం.ఎన్ రాధాకృష్ణ, ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్ శ్రీవాణి రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలే కానీ మహిళలు అన్నిరంగాల్లో మగ వారికి ధీటుగా రాణిస్తారని అన్నారు. నేడు మహిళలు వివిధరాంగాల్లో సత్తాచాటుతూ కొన్ని రంగాలను సైతం శాసిస్తున్నారని వెల్లడించారు. దేశంలోని అత్యున్నత పదవి నుండి నేడు అన్ని రంగాలలో స్త్రీలు సత్తా చాటుతున్నారు అన్నారు. సింగరేణిలోనూ మహిళలు అన్ని విభాగాల్లో అండర్ గ్రౌండ్ విధుల్లో కూడా రాణిస్తున్నారు అని వారికి కావాల్సిన కనీసవసతుల కల్పనతో పాటు పని ప్రదేశాల్లో వారి రక్షణ కోసం తగు చర్యలు తీసుకొని వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ముందస్తుగా నిర్వహించిన క్రీడలలో పాల్గొని గెలుపొందిన మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేశారు, పోష్ చట్టం పై అవగాహన కోసం నిర్వహించిన పరీక్షలో మంచి మార్కులు సాధించిన పలువురు మహిళలకు ఏరియా జనరల్ మేనేజర్, సేవా అధ్యక్షురాలు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సేవా సభ్యులు, సింగరేణి జి.ఎం కార్యాలయ మహిళా ఉద్యోగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, డీజీఎం పర్సనల్ అశోక్, సీఎం ఓ ఏ ఐ అధ్యక్షులు రమేష్, డీజీఎం పర్సనల్ అశోక్, సరిత డివై ఫైనాన్స్ మేనేజర్, కవిత లేడీస్ క్లబ్ ట్రెజరర్, లేడీస్ క్లబ్ సభ్యులు జిఎం కార్యాలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

# ఉచిత వైద్య శిబిరం

**ఆదిలాబాద్ మహా:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. పౌరుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టితో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష , కమీషనర్ రాజు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ప్రాథమిక వైద్యం ఎంతో కీలకమని అన్నారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కోరారు. శిబిరానికి వచ్చిన పలువురు పౌరులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు , మున్సిపల్ సిబ్బంది , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చిరుత పులి గోర్లు, వన్యప్రాణి వస్తువులు స్వాధీనం

### ముగ్గురు ఊట్ల గ్రామానికి చెందినవారిగా గుర్తింపు



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తాడ్లపేట రేంజ్ అటవీలో చిరుత పులి గోర్లు, వన్యప్రాణి వస్తువులను శనివారం స్వాధీనం చేసుకున్నామని జన్నారం అటవీ డివిజనల్ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దండేపల్లి మండలానికి చెందిన కొంతమంది అనుమానాస్పద వ్యక్తులు వన్యప్రాణి వస్తువుల వ్యాపారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తమకు సమాచారం అందిందని చెప్పారు. ఈ నేపథ్యంలో అటవీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిందితులను పట్టుకున్నామని వెల్లడించారు. నిందితులు ఊట్ల గ్రామానికి చెందిన మొద్దే వెంకటేష్, మొద్దే శ్రీనివాస్, దండేపల్లి మండలం పాత మామిడిపల్లి గ్రామానికి చెందిన వనపర్తి శ్రీకాంత్‌గా గుర్తించామని తెలిపారు. చిరుత పులిని దండేపల్లి మండలం ఊట్ల గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మోటారు వాహనాల క్లచ్ వైరుతో చేసిన ఉచ్చులు వేసి చంపారని స్పష్టం చేశారు. నిందితులు చిరుత గోర్లను తొలగించి మృతదేహాన్ని కాల్చివేసినట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. చిరుతను వేటాడి కాల్చిన ప్రదేశాల నుండి నేరానికి చెందిన సాక్ష్యాలను అటవీ అధికారులు సేకరించామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి పాల్గొన్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచనున్నామని అన్నారు.

## పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణీకలు వేయించాలి

### సర్పంచ్ స్రవంతి విజయభాస్కర్ రెడ్డి



**మహా: సంగారెడ్డి ప్రతినిధి:** పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి సంతోష్ కుమార్ అన్నారు.శనివారం మండల పరిధిలోని నంది కంది గ్రామంలో స్థానిక సర్పంచ్ స్రవంతి విజయభాస్కర్ రెడ్డి తో కలిసి ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ఏటా రెండుసార్లు,ప్రతి 6 నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పశువులకు గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైందని, ఈ వ్యాధి సోకిన పశువుల నోటిలో,కాళ్లలో పుండ్లు ఏర్పడి మేత మేయక, నడవలేక నీరసిస్తాయన్నారు. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పడిపోతుందన్నారు. వ్యాధి సోకిన పశువులకు చికిత్స చేయకుంటే మరణిస్తాయన్నారు. అందుకే ముందుగానే నివారణ టీకాలు వేయించుకోవాలని కోరారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పశువులను ఎండబారి నుండి కాపాడుకోవాలని, స్వచ్ఛమైన త్రాగునీరు, మేత అందించాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సుజాత, అరిఫ్, బబితా, లింగమయ్య రమేష్ లు పాల్గొన్నారు.

## తోపుగని చెరువులో ప్రత్యేక పూజలు

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదగిరిగుట్ట, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని తోపుగని చెరువు గోదావరి జలాలతో నిండి అలుగు పోస్తున్న దృశ్య ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో ఉన్న ప్రతి చెరువు నిండేలా చేసి ప్రజలకు, రైతులకు నీరు అందించడం తమ లక్ష్యమని అనరనారు. యాదగిరిగుట్ట పట్టణంలోని తోపుగాని చెరువు నిండడంతో పరిసర ప్రాంతాల చెరువులు కూడా నింపేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.యాదగిరిగుట్ట నుండి వంగపల్లి, రామాజీపేట, తాళ్లగూడెం తదితరంగా 15కు పైగా గ్రామాలకు చెరువులు నింపి నీరు అందే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. చెరువులు నిండడంతో రైతులకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆలేరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారుఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మున్సిపల్ చైర్మన్ వాణి భరత్,కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మన కృషి అగ్రిడ్రోన్ సెంటర్ ను ప్రారంభించన బీర్ల అయిలయ్య




**యాదగిరిగుట్ట , మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన "మన కృషి అగ్రి డ్రోన్ సెంటర్" ను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శనివారం రిబ్బన్ కట్ చేసి అగ్రి డ్రోన్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టడం ద్వారా రైతులకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని తెలిపారు. అగ్రి డ్రోన్‌ల ద్వారా పంటలపై మందులు పిచికారీ చేయడం, ఎరువులు వేయడం, పంటల పరిస్థితిని పరిశీలించడం వంటి పనులు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో చేయగలమని అన్నారు. దీని వల్ల రైతుల శ్రమ తగ్గడంతో పాటు దిగుబడులు పెరగడానికి కూడా సహాయపడుతుందని పేర్కొన్నారు.వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడానికి యువత ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే గారు అన్నారు. రైతులకు కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం గ్రామీణ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు.అనంతరం అగ్రి డ్రోన్ సెంటర్ ని ర్వాహకులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను శాలువాతో సత్కరించారు.

## కుతుబ్ షాహీ పెద్ద మసీదులో రంజాన్ తోఫాల పంపిణీ




### ఇఫ్తార్ విందులో పాల్గొన్న రజిత పరమేశ్వర్ రెడ్డి

**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని కుతుబ్ షాహీ పెద్ద మసీదులో శనివారం రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ తోఫాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఖాజా మౌలానా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కూడా ఆమె పాల్గొన్నారు. రంజాన్ మాసం శాంతి, సహనం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, ఈగ అంజయ్య ముదిరాజ్, బజార్ జగన్నాథ్ గౌడ్, తెల్కల మోహన్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవి రెడ్డి, బూసం రఘునాథ్ రెడ్డి, అస్లాం, అజ్జు, అల్లా భాషా, జలీల్, కాసిం, ఆసిఫ్, అన్వర్ పాషా, అఫ్జల్, ఇషాద్, సలీం, మినాజ్, నాగూర్ భాషా, ఖాజా, రసూల్ మొహమ్మద్, అష్రఫ్, మౌలాలి, జంగీర్ జబ్బార్, బజారు నవీన్ గౌడ్, రంగుల శేఖర్ ముదిరాజ్, జుబేద్, మోసిన్, వాయద్ తదితరులతో పాటు కుతుబ్షాహీ ఉప్పల్ పెద్ద మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.




### తిరుమల తరహాలో మాదిరిగా

## కొండగట్టు అంజన్నను తీర్చిదిద్దుతా...

### ఎమ్మెల్యే సామేల్ పై మండిపడ్డ కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్, మహా : తిరుమల దేవస్థానం స్థాయిలో కొండగట్టు అంజనేయస్వామి దేవాలయాన్ని తీర్చిదిద్దుతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. శనివారం కరినగరం నుండి కొందగట్టుకు పాదయాత్ర చేస్తున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ ఈ మేరకు హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపి తరపున గెలిచిన వారిని తీసుకొని కొండగట్టుకు పాదయాత్ర చేస్తానని మొక్కుకున్న నేపథ్యంలో ఆయన భారీగా పార్టీ కార్యకర్తలతో పాటుగా ఎన్నికల్లో గెలిచిన నాయకులను వెంట తీసుకొని పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం కొండగట్టుకు పవన్‌కళ్యాణ్ భారీగా నిధుల కేటాయించిన విషయాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆంధ్రాలో డబుల్ ఇంజన్ సర్కారు వుండడం వల్లనే కొండగట్టుకు నిధులు వచ్చాయని తెలిపారు. కొండగట్టులో ఇంకా కళ్యాణ మండపాలు, గెస్ట్‌హౌజ్‌లు, భోజనశాలతో పాటుగా కనీస వసతుల కొరత స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. కొండగట్టును మరింత గొప్పగా అన్ని విధాలుగా అభివ□ద్ధి చేయడానికి తనవంతు ప్రయత్నం చేస్తాననని ఆయన హామీ ఇచ్చారు.

## 102 మంది జీవిత ఖైదీలకు మోక్షం


- లైన్ క్లియర్ చేసిన స్టాండింగ్ కమిటీ
- కెబినెట్ ఆమోదం, గవర్నర్ సంతకమే తరువాయి
- ఆరు నెలలుగా ఎదురు చూస్తున్న జీవిత ఖైదీలు

**కుషాయిగూడ, మహా :** జీవిత ఖైదీల విడుదలపై తెలంగాణ హోం శాఖ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీ సి.వి. ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో లా శాఖ కార్యదర్శి బి. పాపి రెడ్డి, తెలంగాణ జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా పాల్గొని సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం తెలంగాణ జైళ్లలో మగ్గుతున్న జీవిత ఖైదీల విడుదల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును మొదలుపెట్టింది ఇందులోనే భాగంగా తెలంగాణ హోంశాఖ జైళ్ళ శాఖరాష్ట్రంలోని జీవిత ఖైదీల ముందస్తు విడుదల అంశంపై విస్తృతంగా చర్చించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం కేసులను పరిశీలించి మొత్తం 102 మంది జీవిత ఖైదీలు ముందస్తు విడుదలకు అర్హులని కమిటీ గుర్తించింది. వీరిలో 96 మంది పురుషులు, 6 మంది మహిళా ఖైదీలు ఉన్నారు. స్టాండింగ్ కమిటీ చేసిన సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఈ అంశంపై త్వరలో రాష్ట్ర కేబినెట్‌లో తుది నిర్ణయం తీసుకున్న అనంతరం గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత విడుదల ఉత్తర్వులు జారీ కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గతంలో 213 మంది జీవిత ఖైదీలను ముందస్తుగా విడుదల చేసిన విషయం తెలిసిందే. విడుదలైన ఖైదీల పునరావాసం కోసం జైళ్ల శాఖ చర్యలు చేపడుతోంది. విడుదలైన ఖైదీల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలో నుండి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది కెసిఆర్ ప్రభుత్వం విడుదలైన ఖైదీలను అక్కున చేర్చి పెట్రోల్ బంకులలో ఉపాధి అవకాశాలు కల్పించారు మళ్లీ నేల ప్రవృత్తిలోకి అడుగుపెట్టకుండా ఖైదీలకు ఉపాధి ఉద్యోగం అవకాశాలు జైళ్ల శాఖ ఉన్నత అధికారులు కల్పిస్తున్నారు క్షమాభిక్ష కోసం ఎన్నో ఏళ్లుగా జీవిత ఖైదీలు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించకపోవడంతో కొంతమంది ఖైదీల కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు విచారణ నిర్వహించిన సుప్రీంకోర్టు జైళ్లలో మగ్గుతున్న జీవిత ఖైదీలను ప్రతి ఏటా పండుగ పర్వదినాలైన మూడు సార్లు క్షమాభిక్ష ధార విడుదల చేయాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విడుదల చేసింది క్షమాభిక్ష అనేది ఖైదీల హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆరు నెలల క్రితం తెలంగాణ జైళ్ల శాఖ నుండి సుమారు 92 మంది ఖైదీల విడుదల జాబితా లిస్టు ను తెలంగాణ హోంశాఖకు పంపించారు. హోం శాఖలో ఖైదీల విడుదల జాబితా లిస్ట్ పెండింగ్ లో ఉంది ఎప్పుడు విడుదలవుతామని ఖైదీలు ఎదురుచూస్తున్నారు. త్వరలో ఖైదీల విడుదలకు లైన్ క్లియర్ అయినట్టు తెలుస్తుంది ఈ సమావేశంలో జైళ్ల శాఖ ఐజీలు ఎర్రం శెట్టి రాజేష్, మురళీ బాబు, వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, హైదరాబాద్ రేంజ్ డీఐజీ శ్రీనివాసరావు, చంచల్‌గూడ సెంట్రల్ జైలు పర్యవేక్షణ అధికారి నవాబ్ శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కొండాపూర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**మహా: సంగారెడ్డి ప్రతినిధి :** కొండాపూర్ లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (NREGS) నిధుల ద్వారా రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ,అలగే రూ.పది, పది లక్షల తో రెండు మహిళల సమైక్య భానాలకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కు గ్రామస్తులు డప్పు చప్పులతో, పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. గ్రామాల్లో మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మల్ల గౌడ్, మాణిక్ ప్రభు, పాండు రంగం, కొండాపూర్ సర్పంచ్ స్రవంతి అమరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజ్ కుమార్, మాజీ సర్పంచ్ రుక్మొద్దీన్, సత్యానందం, పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు



## గృహ అవసరాలకు ఎల్పిజి గ్యాస్ కొరత లేదు ...

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి, మహా:** జిల్లాలో గృహ అవసరాలకు ఏలాంటి ఎల్పిజి గ్యాస్ కొరత లేదని వినియోగదారులు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎల్.పి.జి. గ్యాస్ కొరత లేదని, రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం కాదని, తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు.జిల్లాలో గృహ వినియోగానికి అవసరమైన ఎల్.పి.జి. గ్యాస్ సరఫరా సాధారణంగా కొనసాగుతోందని, గ్యాస్ ఏజెన్సీల ద్వారా సిలిండర్ల సరఫరా నిరంతరంగా జరుగుతోందని తెలిపారు. ఎక్కడైనా సిలిండర్ల కొరత ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైనంత గ్యాస్ నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అనవసరంగా ఎక్కువ సిలిండర్లు బుక్ చేసుకోవడం లేదా నిల్వ చేసుకోవడం చేయవద్దని కోరారు.ప్రభుత్వం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఆసుపత్రి లలో, రెసిడెన్షియల్ హాస్టల్స్, విద్యా సంస్థలలో ఎలాంటి కొరత లేదని తెలిపారు.




## దమ్మాయిగూడ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### పాండాల అనురాధ యాదగిరి గౌడ్

**కుషాయిగూడ, మహా :** కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడలో గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగావర్‌కు దమ్మాయిగూడ మున్సిపాలిటీ మాజీ వార్డు కౌన్సిలర్ పాండాల అనురాధ యాదగిరి గౌడ్ శనివారం వినతిపత్రం అందజేశారు. దమ్మాయిగూడ ప్రాంతంలో రహదారులు దెబ్బతిన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయని తెలిపారు. వెంటనే రహదారులు మరమ్మతులు చేయడం, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఫాగింగ్ మిషన్ వినియోగంలో లేకపోవడం వల్ల పరిసరాల్లో ఈగలు, దోమలు విస్తరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ సంచిత్ గంగావర్ దమ్మాయిగూడ ప్రాంతంలోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా చొరవ తీసుకుని తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## మహర్షి హై స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్



**కుషాయిగూడ, మహా :** కీసర సర్కిల్ పరిధిలోని జవహర్‌నగర్ సంతోష్‌నగర్‌లో ఉన్న మహర్షి హై స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ విజయవంతంగా జరిగింది. స్కూల్ కరస్పాండెంట్ నరసింహాచారి ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ లలిత సమన్వయంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను కరస్పాండెంట్ నరసింహచారి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఎల్‌కేజీ నుండి 9వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 200కు పైగా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థి తన స్టాల్ వద్ద సందర్శకులకు సులభంగా అర్థమయ్యే విధంగా ప్రాజెక్టులను వివరించారు. తెలుగు పదాలను ఎలా ఉపయోగించాలి, ఎలా వ్రాయాలి అనే అంశాలపై విద్యార్థులు ప్రత్యేకంగా వివరణ ఇచ్చారు. అలాగే మానవ శరీరం ఎలా పని చేస్తుంది, ఊపిరితిత్తుల సంరక్షణ, మెదడు కిడ్నీల పనితీరు వంటి అంశాలను కూడా ప్రదర్శనల ద్వారా వివరించారు. ఇస్రో రాకెట్ నమూనాలు, శిశువు ఎదుగుదల దశలు, హిందీ మరియు గణితానికి సంబంధించిన ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తమ పిల్లలు వివిధ అంశాలపై చూపించిన అవగాహనను చూసి గర్వం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నరసింహచారి మాట్లాడుతూ మహర్షి విద్యానికేతన్‌లో విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తక విద్య మాత్రమే కాకుండా మంచి పద్ధతులు, క్రమశిక్షణ, నైతిక విలువలు కూడా అందిస్తున్నామని తెలిపారు. "నేటి బాలలే రేపటి పౌరులు" అనే భావంతో విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యకు ఏమాత్రం తీసిపోని విధంగా పాఠ్యబోధనతో పాటు క్రమశిక్షణ, మంచి మర్యాదలను కూడా విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహర్షి హై స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## ఎస్ఎస్సీ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**భువనగిరి, మహా:** ఎస్ఎస్సీ పరీక్షా కేంద్రాలను స్థానిన సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు పరిశీలించారు. శనివారం భువనగిరి పట్టణంలోని గంజ్ హై స్కూల్, భువనగిరి లోని ప్రభుత్వ బాలుర పాఠశాల , భువనగిరి లోని విజ్ఞాన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్సి పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షకు విద్యార్థులు ఎంతమంది హాజరయ్యారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు భయాందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, భద్రతా చర్యలు , మెడికల్ సిబ్బంది ,తదితర అంశాలను పరిశీలించారు. పరీక్షలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించి పరీక్ష పూర్తయిన వెంటనే జవాబుకు పత్రాలను పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో పరీక్షా కేంద్రాల సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# పెళ్లి పీటలు ఎక్కనున్న 'స్వీటీ'?

దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు 'లేడీ సూపర్ స్టార్'గా వెలుగొందిన అనుష్క శెట్టి వివాహ వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొన్నేళ్లుగా ఆమె పెళ్లిపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, ఈసారి మాత్రం ఆమె త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. 44 ఏళ్ల అనుష్క ఈ ఏడాది పెళ్లి పీటలు ఎక్కేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వరుడు ఆమె కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని, ఇది పూర్తిగా పెద్దలు కుదిర్చిన సంబంధమని సమాచారం. ఇప్పటికే ఇరు కుటుంబాల మధ్య చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. చాలా కాలంగా అనుష్క పేరు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిపి వినిపిస్తున్నప్పటికీ, వారిద్దరూ కేవలం ప్రాణ స్నేహితులమని పలుమార్లు స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో ఈ రూమర్లకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, అనుష్క గత చిత్రం 'ఘాటి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం మలయాళ చిత్రం 'కథనార్' షూటింగ్‌లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సినిమా పనులు పూర్తయిన వెంటనే ఆమె వివాహం చేసుకునే ఛాన్స్ ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.



# రెండోసారి తల్లయిన పూర్ణ..

నటి షామ్నా ఖాసిం అలియాస్ పూర్ణ రెండోసారి తల్లయింది. గతేడాది ఆగస్టులో గర్భం దాల్చిన ఆమె మార్చి 14న ఉదయం పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. దేవుడి ఆశీస్సులతో ఈరోజు ఉదయం 4 గంటల 25 నిమిషాలకు పాప పుట్టింది. తను మాకు లభించిన అపురూపమైన కానుక.

**సాఫీగా డెలివరీ**

ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా డెలివరీ అయినందుకు ఆ భగవంతుడికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. అలాగే ఆస్పత్రి బృందానికి కూడా ధన్యవాదాలు అని రాసుకొచ్చింది. ఇది చూసిన అభిమానులు పూర్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కాగా పూర్ణ 2022లో వ్యాపారవేత్త షానిద్ అసిఫ్ అలీని పెళ్లి చేసుకుంది. ఈ దంపతుల ప్రేమకు గుర్తుగా 2023లో బాబు పుట్టాడు.

**సినిమా**

పూర్ణ మలయాళ నటి. సీమటపాకాయ్, అవును సినిమాలతో తెలుగులో గుర్తింపు తెచ్చుకుంది. శ్రీ మహాలక్ష్మి, నువ్వలా నేనిలా, రాజుగారి గది, అఖండ 2 ఇలా పలు చిత్రాల్లో నటించింది. మహేశ్‌బాబు గుంటూరు కారం సినిమాలో 'కుర్చీ మడతపెట్టి..' పాట ప్రారంభంలో కనిపిస్తుంది. తెలుగుతో పాటు మలయాళ, తమిళ, కన్నడ భాషల్లోనూ మూవీస్ చేసింది.



# నన్ను నేను అమ్ముకోలేను

## ఇండస్ట్రీలో మిమ్మల్ని వాడుకుంటారు

గంపెడాశలతో ఇండస్ట్రీలో అడుగుపెడదామని వస్తున్న ఎంతోమంది తప్పుదారి పడుతున్నారంటోంది బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా. అవకాశాల కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నవారిని కొన్ని అదృశ్య శక్తులు నిలువునా ముంచేస్తున్నాయంటోంది. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో తనుశ్రీ దత్తా మాట్లాడుతూ.. సినీ పరిశ్రమలో మొదట అందానికి ప్రాధాన్యతనిస్తారు. వారికి టాలెంట్ ఉందా? లేదా? అనేది ఆలోచించరు. అందాన్ని చూసి పొగడ్తలు కురిపిస్తారు. కానీ అది విని మీరు బోల్తా కొట్టకూడదు.

**ముందు పొగడ్తలు**

నా చిన్నతనంలో నా తల్లి అపరిచితులతో మాట్లాడకూడదని, వారిచ్చే చాక్లెట్లు తీసుకోకూడదని చెప్పేది. ఇండస్ట్రీలో అలాంటి అపరిచితులు, వారిచ్చే చాక్లెట్లు చాలా రకాలుగా ఉంటాయి. వారి కోరిక తీర్చుకునేందుకు ముందు మిమ్మల్ని పొగుడుతారు. తర్వాత మీ కలల్ని, ఆశయాల్ని ఆసరా చేసుకుని మిమ్మల్ని వాడుకుంటారు. ఈ క్రమంలో అవకాశాలు అందుకుని ముందడుగు వేసిన కొందరు విజయం సాధిస్తారు, మరికొందరు బాధతో ఇంటికి తిరిగెళ్లిపోతారు.

**నన్ను నేను అమ్ముకోను**

ఇంకొంతమందైతే ముందుకు వెళ్లలేక, వెనక్కూ వెళ్లలేక వ్యభిచారంలోకి నెట్టబడతారు. ఇలాంటి రహస్యాలు బయటకు ఎప్పుడూ రావు. ఎందుకంటే సక్సెస్ స్టోరీలు మాత్రమే బయటకు వస్తాయి, వాటి గురించే అందరూ మాట్లాడుకుంటారు. ఇప్పుడిదంతా ఎందుకు చెప్తున్నానంటే నా మాటల వల్ల నలుగురు అలర్ట్ అయి వారిని వారు కాపాడుకున్నా అదే నాకు సంతోషం. ఇండస్ట్రీలో కాంప్రమైజ్ సాధారణమే అని ఓ నటి అన్నందుకు ఆమెతో స్నేహాన్నే తెంచుకున్నాను. నేను ఆర్టిస్ట్‌ను.. ఒకరికి నా జీవితాన్ని అమ్ముకునేదాన్ని కాదు అని చెప్పుకొచ్చింది.

**మీటూ**

మీటూ ఉద్యమం సమయంలో తను కూడా బాధితురాలినేనంటూ మీడియా ముందుకు వచ్చింది తనుశ్రీ దత్తా. నానాపటేకర్ లైంగికంగా వేధించాడని సంచలన ఆరోపణలు చేసింది. 2008లో 'హార్న్ ఓకే ప్లీజ్' సినిమాలోని ఓ పాట షూటింగ్‌లో నానా పటేకర్ సహా మరో ముగ్గురు తనను వేధించారని ఆరోపించింది. అయితే ఘటన జరిగిన మూడేళ్లలోపు ఫిర్యాదు చేస్తేనే విచారిస్తామని, ఇది పదేళ్ల కిందటినాటి ఘటన కావడంతో విచారణ కుదరదని న్యాయస్థానం కేసు కొట్టివేసింది. బాలీవుడ్‌లో అనేక సినిమాలు చేసిన తనుశ్రీదత్తా.. తెలుగులో వీరభద్ర చిత్రంలో యాక్ట్ చేసింది. చాలాకాలంగా సినిమాలకు దూరంగా ఉంటోంది.





# సినిమా ఫ్లాప్ అవుతుందని ముందే తెలుసు..

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తోన్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో హీరోయిన్‌గా చేస్తోంది రాశీ ఖన్నా. ఈ సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న ఆమె ఇటీవల రిలీజైన ఓ తెలుగు సినిమాపై షాకింగ్ కామెంట్స్ చేసింది. ఆ సినిమా రిజల్ట్ ను తాను ముందే ఊహించానంటూ ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ కు పరిచయమైంది రాశీ ఖన్నా. మొదటి సినిమాతోనే అందం, అభినయంగా తెలుగు ఆడియెన్స్ ను కట్టి పడేసింది. దీని తర్వాత జోరు, సుప్రీం, జై లవకుశ, తొలి ప్రేమ, వెంకీమామ, ప్రతిరోజు పండగే.. ఇలా చాలా సినిమాలు చేసిందీ అందాల తార. తెలుగుతో పాటు హిందీ, తమిళం సినిమాల్లోనూ నటించి మెప్పించిందీ అందాల తార. చివరగా తెలుగులో తెలుసు కదా అనే ట్రయాంగిల్ లవ్ స్టోరీలో యాక్ట్ చేసింది. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో కథానాయికగా చేస్తోంది. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది .ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తోంది రాశీ ఖన్నా. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించిన విషయాలను షేర్ చేసుకుంటోంది. ఈ క్రమంలోనే తన చివరి సినిమా తెలుసు కదా సినిమా గురించి షాకింగ్ కామెంట్స్ చేసింది రాశీ ఖ్నా. ' తెతెలుసు కదా షూటింగ్ జరుగుతున్నప్పుడే ఈ సినిమా ఫలితం ఎలా ఉండబోతుందో నాకు అర్థమైపోయింది. సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలో నాకు నచ్చని పాయింట్స్ అన్నీ చెప్పాను. కొన్ని సీన్స్ చిత్రీకరించేటప్పుడు ఇదెందుకో నాకు కరెక్ట్ కాదనిపిస్తుందన్నాను. కానీ, నీరజ కోన (డైరెక్టర్) విజన్ మీద నమ్మకంతో అలాగే ముందుకు వెళ్లాం. క్లైమాక్స్ కూడా అందరూ ఒప్పుకునేలా ఉండాలి, ఇదేదో తేడా కొడుతోందని నాకు అనిపించింది. అందుకే ఆపరేషన్ సీన్ చేయనన్నాను. చివరకు తప్పలేదు. అయినా ఈ సినిమా ద్వారా అందరూ ఏదో ఒక గుణపాఠం నేర్చుకున్నారు. అలా నేను కూడా నా అభిప్రాయాన్ని మరింత గట్టిగా చెప్పాల్సింది అని తెలుసుకున్నాను. ఆ మూవీ షూట్ చేస్తున్నకొద్దీ స్క్రిప్ట్ చాలా మారిపోయింది. నా చేతుల్లో ఏం లేదు' అని రాశీ ఖన్నా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ బ్యూటీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా తెలుసు కదా సినిమాలో సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా నటించాడు. శ్రీనిధి శెట్టి మరో హీరోయిన్‌గా యాక్ట్ చేసింది.

# బాలీవుడ్‌లో కీర్తి సురేష్ మరో భారీ ప్రాజెక్ట్..

## రాజ్ కుమార్ రావుతో కలిసి సరికొత్త థ్రిల్లర్!

బాలీవుడ్ విలక్షణ నటుడు రాజ్ కుమార్ రావు మరియు సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తొలిసారిగా జతకట్టబోతున్నారు. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'రఫ్తార్' (Raftaar). ఇంటెన్స్ థ్రిల్లర్ డ్రామాగా రాబోతున్న ఈ ప్రాజెక్టును రాజ్ కుమార్ రావు భార్య, నటి పత్రలేఖ తన సొంత నిర్మాణ సంస్థ 'కాంపా ఫిల్మ్స్'పై అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పణలో నిర్మించబోతుంది. విద్యా వ్యవస్థలోని చీకటి కోణాలు, కార్పొరేట్ పోటీ, సక్సెస్ కోసం ఆరాటపడే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా సాగనుంది. ముఖ్యంగా డబ్బు, అధికారం మనుషుల సంబంధాలను ఎలా మారుస్తాయనే అంశాన్ని దర్శకుడు ఆదిత్య నింబాల్కర్ ఈ థ్రిల్లర్‌లో చూపించబోతున్నారు. ఇక నేషనల్ అవార్డు గ్రహీతలైన రాజ్ కుమార్ రావు, కీర్తి సురేష్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరితో పాటు అనూరాగ్ ఠాకూర్, తాన్యా మణిక్తలా మరియు రజత్ కపూర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో 'సెక్టార్ 36'తో మెప్పించిన ఆదిత్య నింబాల్కర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో కథనం చాలా ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ భారీ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com